భోగభాగ్యాల పండుగ



నేడు భోగి

ఒంగోలు (కల్చరల్), జనవరి 13: సంక్రాంతి లక్ష్మికి స్వాగత ద్వారం వంటిది 'భోగి పండుగ. ఆ పండుగ నాటి నుంచి ప్రతి ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంటుంది. ప్రతి మహిళ పండుగ పిండి వంటల తయారీలో తలమునకలవుతుంది. ఇక చిన్నారులు, యువతీ యువకుల ఆటలకైతే అంతే ఉండదు. సంక్రాంతి పండుగ మూడురోజులు పల్లెపల్లెనా ఆహ్లాదకర వాతావరణం ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తుతుంది. దక్షిణాయణంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగిమంటల రూపంలో అగ్నిదేవుడికి సమర్పించి ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ప్రసాదించమని ప్రార్థించడంలో కూడా భోగిమంటల్లోని అంతరార్థం. తెల్లవారుజామునే ఆవుపేడ పిడకలు, తాటాకులు, కోసిన పంటల తాలూకు అవశేషాలు మొదలైన వాటిని రాజేసి ఇంట్లోని పాత వస్తువులను ఈ మంటల్లో వేస్తారు.

సంక్రాంతి సందడి

- జిల్లావ్యాప్తంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- పలుచోట్ల ఎన్నికల ప్రభావంతో రాజకీయపక్షాల ఆధ్వర్యంలో వేడుకలు
- పొరుగు ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్న జిల్లావాసులు
- బస్సులు, రైళ్లు ఫుల్



ముండ్లమూరులో అరిశెలు వండుకొంటున్న ఓ కుటుంబం



ఒంగోలులోని చెన్నకేశవ లేఅవుట్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్‌లో) కోలాటం



ఒంగోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పొడవునా అనేక పండుగలు ఉన్నా తెలుగు వారి ఇళ్లలో సంక్రాంతి ప్రత్యేకమైంది. పంటలు పొలం నుంచి ఇళ్లకు చేరడం ప్రారంభమయ్యే సమయంలో వచ్చే ఈ పర్వదినాన్ని గ్రామీణ ప్రాంతంలోని రైతులు, రైతుకూలీలు పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. కాలక్రమంలో అనేక మార్పులు సంభవించినా సంక్రాంతి పండుగను మాత్రం అన్నివర్గాల ప్రజలు ఘనంగానే జరుపుకుంటున్నారు. ఉపాధి కోసం, ఉద్యోగ, వ్యాపార రీత్యా పొరుగు ప్రాంతాలకు వెళ్లిన వారు.. అలాగే అవసరాల కోసం పల్లెలను వీడి పట్టణాలకు నివాసాలు మార్చిన వారు సైతం సంక్రాంతి పండుగ మూడు రోజులు స్వగ్రామాలకు వచ్చి ఉల్లాసంగా గడపడం అనవాయితీ. అలాగే ఈసారి కూడా పొరుగు ప్రాంతాల్లో ఉండే వేలాదిగా జిల్లావాసులు ఇప్పటికే స్వస్థలాలకు చేరారు. దీంతో హైదరాబాద్, విశాఖ, చెన్నై, బెంగళూరు, ప్రాంతాల నుంచి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. ఈనెల 18 వరకు రిజర్వేషన్లు దొరికే పరిస్థితి లేకపోగా ఆర్టీసీ వందలాది స్పెషల్ బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. ఇక సొంత వాహనాలలో పండుగ రోజుల్లోనూ భారీగానే జిల్లావాసులు వచ్చే అవకాశం ఉంది. అమెరికా, ఇతర దేశాలలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాకుండా వివిధ ప్రధాన నగరాల్లో ఉన్న జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువత పెద్దఎత్తున తరలివస్తోంది.



ఒంగోలు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ


జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. వారం నుంచే చాలాచోట్ల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలుప్రాంతాల్లో రాజకీయ పక్షాల ఆధ్వర్యంలోనూ ఆయా వర్గాలను భాగస్వామ్యం చేస్తూ ఈ తరహా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఉద్యోగ, వ్యాపార, ఉపాధి కోసం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లిన జిల్లావాసులు భారీగా తమ స్వస్థలాలకు తరలివస్తున్నారు. దీంతో గ్రామాలు, పట్టణాలు కోలాహలంగా మారాయి. అలాగే ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో..

ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో సంక్రాంతి వేడుకలపై రాజకీయపక్షాల ప్రభావం కనిపిస్తోంది. పలుచోట్ల వివిధ స్థాయిల్లోని రాజకీయ పక్షాల నేతలు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అధికార వైసీపీలో టికెట్ల లొల్లితో అత్యధిక ప్రాంతాల్లో అయోమయ పరిస్థితి కనిపిస్తుండగా జోరు మీద ఉన్న టీడీపీ శ్రేణులు మాత్రం ఉత్సాహంగా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పండుగ సమయంలో మరింత ఉత్సాహంగా ఇవి జరిగే అవకాశం ఉంది. అయితే జిల్లాలోని రైతుల ఇళ్లలో మాత్రం సంక్రాంతి వేడుకల ఉత్సాహం అంతగా కనిపించడం లేదు. ఈ ఏడాది అనావృష్టితో ఖరీఫ్, భారీవర్షాలతో రబీ దెబ్బతినగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని రైతులు పంటలను సాగు చేస్తున్నారు. పెట్టుబడులు భారం కావడంతో పాటు కీలక పంటలు ప్రస్తుతం బెట్ట వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. అదనపు ఖర్చుతో పంటలకు నీరు పెట్టడం, తెగుళ్ల నివారణకు మందులు చల్లడం వంటి పనుల్లో వారు ఉన్నారు. ప్రస్తుతం రైతుల ఇళ్లలో సంక్రాంతి వేడుకల హడావుడి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

ముగ్గులు, ఆటల పోటీలతో కోలాహలం

సంక్రాంతి పండుగ సమయంలో పల్లె, పట్టణం తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున క్రీడ, సాంస్కృతిక పోటీలు జరుగుతుంటాయి. స్థానికంగా ఎక్కడికక్కడ యువకులు, వివిధ ప్రజాసంఘాలు నిర్వహిస్తాయి. క్రికెట్, చెడుగుడు, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి వాటితోపాటు ఎడ్లపందేలు, ట్రాక్టర్ పోటీలు విస్తారంగా నిర్వహిస్తారు. మరోవైపు మహిళలను ఉత్సాహరుస్తూ ముగ్గులు, ఇతరత్రా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. అలాగే ఈ ఏడాది కూడా వారంక్రితం నుంచే జిల్లాలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సమయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీలు ఈ ఏడాది కూడా జిల్లాలో వారం ముందుగానే జరిగాయి. అప్పటి నుంచి ప్రారంభమైన ఈ సందడి మరో వారంరోజులకుపైగా వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో కొనసాగనుంది.





పామూరులో ఉగ్ర యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

టీడీపీ నేత ఔదార్యం

- ప్రాణం తీసిన గుంతలను పూడ్చేశారు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- సొంత డబ్బులతో బాగుచేయించిన సుబ్బయ్య
- కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

తాళ్లూరు, జనవరి 13 : మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్య ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రమాదాలకు నెలవుగా ఉన్న తూర్పుగంగవరం రోడ్డులో ఉన్న పెద్దపెద్దగుంతలను తన సొంత డబ్బులు వెచ్చించి పూడ్పించారు. తూర్పుగంగవరం-తాళ్లూరు రోడ్డుమార్గం గుంతలమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలోని ఇళ్లలోని మురుగునీరు, హరిదాస్‌నగర్‌లోని కాలువల మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో తూర్పుగంగవరం గ్రామ శివారున మురుగు నీరు నిల్వ ఉండి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికార పార్టీ నేతలు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రెండు నెలల కిందట దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సొంత నిధులతో తాత్కాలికంగా కంకర తోలించారు. మురుగు నీటి ప్రవాహం ఆగకపోవడంతో ఆ గుంత మరింత పెద్దదై మురుగు తటాకంలా మారింది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనచోదకులు పలువురు జారి బురదనీటిలో పడిన సంఘటనలు ఉన్నాయి. మూడు రోజుల క్రితం ఈ గుంతల వల్ల మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓయువకుడు పక్కన వెళ్తున్న టిప్పర్ కింద పడి మృతి చెందారు. దీంతో చలించిన సుబ్బయ్య తన వంతుగా ప్రమాదాలు జరుగకుండా రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గ్రామ శివారున బురద మయంగా వున్న పెద్దపెద్ద గుంతలను పెద్దరాళ్ల మట్టితో నింపి పైన కంకర్‌తో నింపి డోజర్‌తో చదును చేయించారు. రోడ్డుపైన మురుగు నీరు నిల్వ ఉండకుండా ఇరుపైపులా కాలువలు తీసి ఖాళీ స్థలంలోకి మురుగు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న రోడ్డు బాగవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. పనులు చేయించిన టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్యను ప్రజలు అభినందించారు. టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య, హరిబాబు, తదితరులు దగ్గరుండి రోడ్డు పనులను పర్యవేక్షించారు.



గుంతలతో ప్రయాణానికి ఇబ్బందిగా ఉన్న తూర్పుగంగవరం రోడ్డు (ఫైల్)



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న సుబ్బయ్య, టీడీపీ నాయకులు

అంగన్‌వాడీల కోటి సంతకాల సేకరణ

- దీక్ష శిబిరం వద్ద వర్కర్లను దూషించిన వ్యక్తి
- అతనిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ఒంగోలు నగరం, జనవరి 13 : డిమాండ్ల సాధన కోసం 33 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట శనివారం ఉదయం ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు ప్రారంభించారు. ఒకవైపు నిరవధిక దీక్షలను కొనసాగిస్తూనే 'జగనన్నకు చెబుదాం' పేరుతో సంతకాల సేకరణ చేపట్టారు. కాగా జిల్లావ్యాప్తం గా సంతకాల సేకరణతోపాటు వివిధ రూపాల్లో తమ నిరసనను తెలిపారు. మానవహారాలు, ధర్నాలు, దీక్షలు, వినూత్న రీతిలో కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులో దీక్షలను సీఐటీయూ నాయకుడు పారా శ్రీనివాసులు ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేందుకు ఏమాత్రం చొరవ చూపడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చర్చల పేరుతో అంగన్‌వాడీలను అవమానిస్తున్నదన్నారు.



ఒంగోలులో సంతకం పెడుతూ నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

కార్యకర్తలను దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారిని దుర్భాషలాడాడు. వేతనాల కోసం ఆందోళన చేస్తున్న వారిని అవమానకరంగా మాట్లాడాడు. దీంతో అంగన్‌వాడీలు అతనిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కావాలంటూ పోలీసులను కోరారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను అకారణంగా దర్భాషలాడిన వ్యక్తిని శిక్షించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అన్నపూర్ణ, సంధ్య, సుబ్బమ్మ, ప్రశాంతి, హేమేమా పాల్గొన్నారు.

వైసీపీలో సంప్రదింపుల మేళా

- బాలినేనితో ఫోన్‌లో సజ్జల మంతనాలు
- మాజీ మంత్రికి ఐబీ చీఫ్ ఫోన్
- మాగుంటను కలిసిన ఎమ్మెల్యేలు బలరాం, సుధాకర్
- మంత్రి సురేష్ లేకుండానే వైపాలెం వెళ్లిన చంద్రశేఖర్



భేటీ అనంతరం ఎంపీ మాగుంటతో కలిసి బయటకువస్తున్న ఎమ్మెల్యేబలరాం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) అధికార వైసీపీలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు నెలకొన్న దశలో శనివారం నాయకుల మధ్య సంప్రదింపులు, సమాలోచనలు, బుజ్జగింపుల పర్వం కొనసాగింది. సీఎం ఇంటర్వ్యూ కూడా దొరక్క అలిగి హైదరాబాద్ వెళ్లి శుక్రవారం జిల్లాలో రెండు ముఖ్య సమావేశాలకు కూడా హాజరుకాని బాలినేని శ్రీనివాసరెడ్డితో ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ఇంటెలిజెన్స్ చీఫ్ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడి బుజ్జగింపులకు శ్రీకారం పలికారు. పార్టీ అధినాయకత్వం పూర్తిగా పక్కనబెట్టిన ఎంపీ మాగుంటతో చీరాల, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు కరణం బలరాం, సుధాకర్‌బాబు ఒంగోలులో వేర్వేరుగా భేటీ అయ్యారు. మొత్తంగా వైసీపీలో సంక్షోభ పరిస్థితులు ఏరోజు ఏమలుపు తిరుగుతాయేనన్న అంశం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

బాలినేనికి ఫోన్లపై ఫోన్లు

హైదరాబాద్‌లో ఉన్న బాలినేనికి విజయసాయిరెడ్డితోపాటు సజ్జల ఫోన్లు చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది. 'సీఎంను కలిసేందుకు మీకు ఇబ్బంది ఏముంటుంది. అసలు మీరు విజయవాడ వచ్చి వేచి ఉన్న విషయమే ఆయనకు తెలియదు. తెలిస్తే అలా జరగదు. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడొచ్చి సీఎంను కలవొచ్చు' అని వారు చెప్పినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు మాగుంటతోపాటు బాలినేని కూడా కొందరు తెలుగుదేశం నాయకులతో టచ్‌లో ఉన్నారని సీఎంకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తదనుగుణంగానే శనివారం వీరు బాలినేనికి ఫోన్లు చేసి సీఎంను కలిసేందుకు రమ్మని కోరినట్లు సమాచారం. అయితే బాలినేని ఇదిగో వస్తున్నా అని మాత్రం చెప్పకపోవడం గమనార్హం. ఇలా సంప్రదింపులు జరుపుతూనే సీఎం జగన్ ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ బరిలో కూడా వేరేవారిని దించే ప్రయత్నాలు ప్రారంభించడం బాలినేనితోపాటు ఆయన వర్గీయుల్లోనూ అనుమానాలు రేకెత్తిస్తోంది.

మహీధర్‌రెడ్డితో వేమిరెడ్డి భేటీ

కందుకూరు నియోజకవర్గానికెళ్లి పనిచేసుకోవాలని ఆ పార్టీలో బీసీ విభాగం నాయకుడు బొట్ల రామారావుకు జగన్ సూచించిన నేపథ్యంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంతనాలు జరిపారు. శుక్రవారం రాత్రి వీరిద్దరూ నెల్లూరులో కలిశారు. కాగా శనివారం మహీధ రరెడ్డి కందుకూరులో మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నియోజకవర్గ వైసీపీ టికెట్ బీసీ అభ్యర్థికిస్తే స్వాగతిస్తానని ప్రకటించారు. అయితే వేమిరెడ్డి సూచనల మేరకు మహీధర్ మీడియా సమావేశం నిర్వహించినప్పటికీ ఆయన మాటలు జగన్‌కు రుచించాయా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

మాగుంటను కలిసిన ఇద్దరు ఎమ్మెల్యేలు

ఒంగోలులో ఉన్న మాగుంటతో అధిష్ఠానం నేరుగా మాట్లాడిన దాఖలాలు లేవు. అయితే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. మీరేమీ విలేకరుల సమావేశం పెట్టి ఏదేదో మాట్లాడాల్సిన అవసరం లేదని కూడా చెప్పారని అంటున్నారు. ఒంగోలులో ఉన్న మాగుంటను శనివారం ఉదయం ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కలిశారు. 'మీతోపాటు నేనూ ఉంటా. మీరు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా నడుస్తా. నన్నూ కలుపుకుపోండి' అంటూ ప్రతిపాదించినట్లు వైసీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆ తర్వాత చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కూడా మాగుంటను కలిశారు. ఇప్పటికైతే చీరాల వైసీపీ సీటు ఆయన కుమారుడు వెంకటేష్‌కే ఖరారై ఉంది. అయితే వైసీపీలో ప్రస్తుతం మాగుంట పరిస్థితి సవ్యంగా లేని దశలో ఆయన్ను కలిసిన బలరాం ఏమి సలహాలిచ్చారు అనేది కీలకంగా మారింది.

మంత్రి సురేష్ లేకుండా వైపాలెంలో..

వైసీపీ వైపాలెం ఇన్‌చార్జిగా నియమితులైన తాటిపర్తి చంద్రశేఖర్ ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మంత్రి సురేష్ లేకుండానే శనివారం నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. తొలుత ఆయన మార్కాపురంలో ఆ నియోజకవర్గ నేతలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కొద్దిమంది మినహా ముఖ్య నాయకులంతా హాజరయ్యారు. మంత్రి సురేష్‌కు నమ్మినబంటు అయిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భర్త పిచ్చయ్య గైర్హాజరయ్యారు. పెద్దారవీడు కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీలతో పాటు 11మంది సర్పంచ్‌లు దూరంగా ఉన్నారు. ఇతర మండలాల నుంచి ముఖ్యులంతా హాజరయ్యారు. ఆయా మండలాల నుంచి హాజరైన వారిలో సురేష్ మద్దతుదారులే ముందుండి చంద్రశేఖర్‌ను నడిపించటం కనిపించింది. అయితే చంద్రశేఖర్ ఆ తర్వాత త్రిపురాంతకం వెళ్లి దర్శనం చేసుకుని వైపాలెం చేరారు. అయితే తొలిసారి నియోజకవర్గానికి వస్తూ మంత్రి సురేష్ లేకుండా వెళ్లటంపై విమర్శలు వచ్చాయి. అయినా అక్కడ గైర్హాజరైతే మంత్రికి ఇబ్బందని ఆయన వర్గీయులు ఎక్కువమంది చంద్రశేఖర్‌కు స్వాగతం పలికారు. మంత్రి సురేష్ సమయాన్ని ముందు తీసుకోకుండా చంద్రశేఖర్ ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. ఆశించిన స్పందన రాకపోవటంతో చంద్రశేఖర్ అనుయాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

అలుగు పొలుసు అక్రమ రవాణా

- టంగుటూరు టోల్‌గేట్ వద్ద పట్టుకున్న పోలీసులు
- రూ.57లక్షల విలువ ఉంటుందని అంచనా
- బస్సు నుంచి నిందితుడు పరారీ
- ఎస్ఈబీ అధికారుల అదుపులో డ్రైవర్

మెయిన్‌లో..





భార్యను చంపి భర్త ఆత్మహత్య

- పుల్లలచెరువు మండలం నాయుడుపాలెంలో ఘటన
- మృతురాలు బీఎస్ఎఫ్ ఉద్యోగి
- కొంతకాలంగా ఇద్దరి మధ్య కలహాలు
- బంధువులు సర్దిచెప్పి వెళ్లిన మరుసటి రోజే ఘటన

మెయిన్‌లో..

ప్రజాప్రతినిధుల సంక్రాంతి శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 13 : జిల్లా ప్రజలకు ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సమేతంగా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలతో పెద్ద పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

దామచర్ల శుభాకాంక్షలు

ఒంగోలు(కార్పొరేషన్): జిల్లా ప్రజలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని, ఈ ఏడాది అందరి జీవితాల్లో ఆనందాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

ఒంగోలు(క్రైం): జిల్లా ప్రజలు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ మలికగర్గ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. సంక్రాంతి అందరి కుటుంబాల్లో నూతన కాంతుల నింపాలని ఆమె ఆకాంక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మద్దిపాడు, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. కోడిపందేలు, పేకాటలతోపాటు అల్లర్లకు పాల్పడితే అట్టివారిపై చర్యలు తప్పవన్నారు. ఊరికి వెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌లో చెబితే ఆ ఇంటిపై పోలీసు నిఘా పెడతామని చెప్పారు. ఆరుబయట మద్యం తాగితే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

భోగి మంటలు..భోగభాగ్యాల సిరులు..!

సంక్రాంతికి స్వాగతద్వారం భోగి ● బొమ్మలకొలువులు, భోగిపళ్లతో మహిళల సందడి ● నేడు భోగిపండుగ

ఒంగోలు (కల్చరల్), జనవరి 13: 'సంక్రాంతి' తెలుగు లోగిళ్లలో ఆనందకాంతులను వెదజల్లే అతిపెద్ద పండుగ. ముఖ్యంగా ప్రతి పల్లె పులకించిపోయే సంప్రదాయ వేదిక. చల్లని గాలులు, పచ్చని పైరులు, ధాన్యపు రాశులు వీటన్నిటి నడుమ అందంగా నృత్యం చేసే డూడూ బసవన్నలు, హరిలోరంగ హరి అంటూ హరిదాసుల గజ్జల చప్పుళ్లు, జంగం దేవరలు, పగటి వేషగాళ్లు, ఇంట్లోకి స్వాగతం పలుకుతూ ఇంటి ముంగిట కొలువైన రంగవల్లులు, వాటిలోని గొబ్బెమ్మలు, మా తెలుగు పౌరుషాన్ని చూడమన్నట్లు రంకెవేసే ఎద్దులు.. ఇలా చెప్పుకుంటూపోతే సంక్రాంతి పండుగకు ఉన్నన్ని ప్రత్యేకతలు మరే పండుగకు లేవని చెప్పొచ్చు. అటువంటి సంక్రాంతి లక్ష్మికి స్వాగత ద్వారం వంటిది సంక్రాంతి పండుగకు ముందు వచ్చే 'భోగిపండుగ'. భోగిపండుగ నాటి నుంచి ప్రతి ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంటుంది. ప్రతి మహిళ పండుగ పిండివంటల తయారీలో తలమునకలవుతుంది. ఇక చిన్నారులు, యువతీ యువకుల ఆటలకైతే అంతే ఉండదు. ఎన్నోరకాల ఆటలు మనకు ఈ సందర్భంగా ప్రతి పల్లెలోను కనిపిస్తాయి. ఒకవైపు మనిషి శరీరానికి హాని కలిగించే విపరీతమైన మంచు, చలిగాలులతో కోరలుచాచిన హేమంతరుతువు ముగిసి చెట్ల ఆకులు చిగురించే శిశిరరుతువు ప్రారంభమయ్యే సమయం దగ్గరవుతుంది. దీంతో ఈ మూడురోజులు పల్లెపల్లెనా ఆహ్లాదకర వాతావరణం అందరినీ ఆనందంలో ముంచెత్తుతుంది.

ఉత్తరాయణం ప్రారంభం

చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగిపండుగ రోజు. అందుకే ఆ రోజున ప్రతి ఇంటి ముందు భోగిమంటలు వేసి చలికాచుకోవటం ఆనవాయితీ. 'భగ' అనే పదం నుంచి భోగి అనే మాట వచ్చినట్లు చెబుతారు. భగ అంటే వేడి లేదా మంట. ఇక సంవత్సరంలో ఉండే ఉత్తరాయణం, దక్షిణాయనాల్లో భోగిపండుగ దక్షిణాయనానికి ఆఖరు రోజు. అంటే భోగి మరుసటి రోజు నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. దక్షిణాయణంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగిమంటల రూపంలో అగ్నిదేవుడికి సమర్పించి ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ప్రసాదించమని ప్రార్థించటం కూడా భోగిమంటల్లోని అంతరార్థం. తెల్లవారుజామునే ఆవుపేడ పిడకలు, తాటాకులు, కోసిన పంటల తాలూకు అవశేషాలు మొదలైన వాటిని రాజేసి ఇంట్లోని పాతవస్తువులను ఈ మంటల్లో వేస్తారు. పనికిరాని చెడు పాత ఆలోచనలను తగలబెట్టి కొత్తగా కాలంతో బాటు వచ్చే మంచి మార్పులను ఆహ్వానించటానికి కూడా ఈ భోగిమంట సంకేతం. అయితే టైర్లు, కిరోసిన్, ప్లాస్టిక్ వస్తువులు వంటివి వాడకూడదు. ఇవి పర్యావరణానికి చేటుతెచ్చే ప్రమాదం ఉంది. ఇక భోగిమంటలు పూర్తికావటంతోనే 'నలుగుతోస్నానం' చేయటం తెలుగువారిళ్లలో కనిపిస్తుంది. నువ్వులనూనె ఒంటికి రాసుకుని, సున్నిపిండిని మర్దన చేసి ఆ తర్వాత కుంకుడుకాయ రసంతో తలస్నానం చేస్తారు. నలుగుస్నానం వల్ల చలికాలంలో మన శరీరంలో చేరిన కఫదోషాలు తొలగిపోతాయి. శరీరం నూతన కాంతిని, ఉత్తేజాన్ని పొందుతుంది.

పులగంతో ఆరోగ్యం

ఇక సంక్రాంతి పండుగనాటికి ప్రతి పల్లెలో ధాన్యం ఇళ్లకు చేరుతుంది కనుక, భోగిపండుగ నాడు కొత్తబియ్యంతో వండిన 'పులగం' తినటం గొప్ప సంప్రదాయం. కొత్తబియ్యం, పెసరపప్పు, మిరియాలు కలిపి చేసే పులగం రుచికరంగానే కాకుండా ఎంతో పోషకవిలువలు కలిగి ఉంటుంది. జీర్ణశక్తి మందగించే ఈ కాలంలో పులగాన్ని భోగినాడు తప్పకుండా తినాలని, ఇది జీర్ణశక్తిని ప్రేరేపిస్తుందని పెద్దలు చెబుతారు.



బొమ్మల కొలువు

ఇక భోగిపండుగ అంటే ప్రతి ఇంట సందడి చేసేది 'బొమ్మలకొలువు'. మహిళలు భోగినాటి సాయంత్రం వివిధరకాల బొమ్మలతో బొమ్మలకొలువును ఏర్పాటు చేసి చుట్టుపక్కల వారిని పిలిచి పేరంటం చేస్తారు. పిల్లలకు భోగిపళ్లు పోయటం మొదలైన వాటితో ప్రతి ఇల్లూ సందడిగా మారుతుంది. ఈ బొమ్మలకొలువులో మధ్యలో ఒక కలశాన్ని ఉంచి దానిని శ్రీమహాలక్ష్మిగా భావించి పూజిస్తారు. అదేవిధంగా గాలిపటాలు, అష్టాచెమ్మా, వైకుంఠపాళి, చెడుగుడు, కబడ్డీ, ఖోఖో, బొంగరాలాటలు, గోళీలాటలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి ఈ పండుగ సందర్భంగా ప్రతి పల్లె ఒక క్రీడామైదానంగా మారి సందడి చేస్తుంది. అయితే మారుతున్న కాలాన్ని బట్టి చాలా ఆటలు కనుమరుగయ్యాయి.

ఘనంగా చంద్రన్న సంక్రాంతి సంబరాలు



ఎండ్లూరులో బహుమతులను అందజేసిన హరిబాబు



బూదవాడలో విజేతలను అభినందిస్తున్న విజయ్‌కుమార్

● ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సంతనూతలపాడు, జనవరి 13: చంద్రన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం ఎండ్లూరు గ్రామంలో సీనియర్ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు కె.శ్రీనివాసరావు, సుమతి, మాధవి, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భోగిమంట కార్యక్రమం

సంతనూతలపాడు బస్టాండ్‌లో ఆదివారం ఉదయం 5గంటలకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో భోగిమంట కార్యక్రమం జరుగుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వైసీపీ ప్రజావ్యతిరేక జీవోల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తారని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

బూదవాడలో..


చీమకుర్తి: చంద్రన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా బూదవాడ పంచాయతీ పరిధిలో ముగ్గుల పోటీలను శనివారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. మొదటి బహుమతి పొందిన ఇంటూరి గాయత్రి, ద్వితీయ బహుమతి పళ్ల సుబ్బమ్మలకు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, రూరల్ అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, బత్తుల నరసింహారావు, తిరుపతినాయుడు, లగడపాటి రవి, మేదరమెట్ల కోటేశ్వరరావు, బీమయ్య, బోస్, మోమన్, గాలి వెంకటసుబ్బయ్య, నరసయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

మద్దిపాడు, జనవరి 13: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకుడు బంకా సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులో అంగన్‌వాడీలు లెమన్ స్పూన్ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై చిన్నచూపు చూస్తుందని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాతాని ధనలక్ష్మి, లక్ష్మి, సుజాత, నాగలక్ష్మి, రజని పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): నాగులుప్పలపాడు బస్టాండ్‌సెంటర్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వరోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఎస్మా జీవో ప్రతులను దహనం చేసి తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, వెంకటసుబ్బమ్మ, దుర్గాభవానీ, రమ, రజిని పాల్గొన్నారు.



మద్దిపాడులో లెమన్‌స్పూన్ ఆటాడుతున్న అంగన్‌వాడీలు



నాగులుప్పలపాడులో జీవో ప్రతుల దహనం

వైభవంగా తిరుమంజనసేవ





పూజలలో పాల్గొన్న శిద్దా రాఘవరావు, సుధీర్‌కుమార్

చీమకుర్తి, జనవరి13 : చినతిరుమలగా భక్తులు భావించే కె.అగ్రహారం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస విశేషపూజల్లో భాగంగా తిరుమంజనసేవను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు పాల్గొని విశేషపూజలు జరిపారు. కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు, శిద్దా వెంకటేశ్వరరావు, హనుమంతరావు, సూర్యప్రకాశరావు, భక్తులు పాల్గొన్నారు.

తెప్పోత్సవ నిర్వహణకు భారీ ఏర్పాట్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఒంగోలు (కల్చరల్), జనవరి 13: కనుమపండుగ సందర్భంగా శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి, శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థాన అధ్యక్షుడు గురునాథరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను నగర డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులతో కలిసి శనివారం స్థానిక దేవస్థాన కళ్యాణమండపంలో ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి స్వామివార్ల పారువేట, 7 గంటల నుంచి రంగారాయుడు చెరువులో తెప్పోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవో డి.రజనీకుమారి, సభ్యులు ప్రసాద్‌బాబు, గోవర్ధనరెడ్డి, మదన్‌మోహన్, హరిప్రియాదేవి, పల్లెపు మురళి, అర్చకులు రమానాథాచార్యులు, రామకృష్ణ పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 13 : అధికార రాజకీయాల్లో బహుజనులు తమ వాటా పొందడానికి తగిన ప్రయత్నాలు చేయాలని రాజకీయ విశ్లేషకుడు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ లీడర్షిప్ వ్యవస్థాపకుడు సతీష్‌చంద్ర పేర్కొన్నారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన తెలుగు రాష్ట్రాల్లో మూడు ముక్కలాట, రాజకీయ క్రీడ ఆ కులాలదేనా? అనే అంశంపై జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. బహుజనులు సంఘటితంగా రాజకీయ శక్తిగా ఎదగాలని ఆయన చెప్పారు. ఫౌండర్ ప్రెసిడెంట్ పులి మల్లికార్జునరావు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అంబేద్కర్, కాన్షిరాం సూచించిన మార్గాల ద్వారా రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ అడ్వయిజర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగభూమి సాంస్కృతిక కార్యక్రమం

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నటరాజ స్వామి చిత్రపటానికి సంఘ సభ్యులు, కళాకారులు పూలమాల సమర్పించారు. అనంతరం సంఘ కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షతన వహించిన సభలో నూదనగుంట వెంకటేశ్వర్లు, జాలాది మోహన్, మిడసల మల్లిఖార్జునరావు, కొలచనకోట ఆంజనేయులు, మాకా ఆంజనేయులు ప్రసంగించారు. కార్యక్రమంలో కోశాధికారి ధేనువకొండ వెంకటసుబ్బయ్య, సభ్యులు దిగ్విజయ్, బాబూ రావు, యశోద, ఇంద్రజ్యోతి, సంతవేలూరి కోటేశ్వరరావు, కనమాల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు ఫుల్..రిజర్వేషన్ నిల్..!

సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థకు డిమాండ్

కిటకిటలాడుతున్న బస్సులు, రైల్వేస్టేషన్లు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 13 : సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పండుగకు సొంత ఊర్లకు చేరుకునేందుకు ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఇన్నిరోజులు ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న వారు పెద్దపండగకి సొంతూర్లకు వస్తున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వగా శనివారం నుంచి నాలుగు రోజులపాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వచ్చేశాయి. దీంతో రెండు రోజుల నుంచి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రైవేటు రవాణా సౌకర్యాలన్నింటిలో రిజర్వేషన్ నిల్ బోర్డులు దర్శనమివ్వగా శనివారం ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా రద్దీ పెరగడంతో ఇబ్బందులు తప్పలేదు. పట్టణాలనుంచి గ్రామాలకు వెళ్లేందుకు పల్లెవెలుగు బస్సులే ఆధారం కావడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం కొన్ని ప్రాంతాలకే ప్రత్యే బస్సులను ఏర్పాటు చేయడంతో అప్పుడప్పుడు వచ్చే పల్లె వెలుగు బస్సు కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.



ఒంగోలులో బస్సు కోసం వేచివున్న ప్రయాణికులు

జగన్ పాలనలో సామాన్యులపై పన్నుల భారం

● టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు

మద్దిపాడు, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో సామాన్యులపై పన్నుల భారం పెరిగి అల్లాడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మద్దిపాడు, లింగంగుంట గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పనకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో ప్రతిఒక్కరి ఆర్థికపరిస్థితి మెరుగుపడేలా చంద్రబాబు కృషి చేస్తారని చెప్పారు. జగన్ పాలనలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవబత్తిన ప్రసాద్, పాటిబండ్ల అజయ్, మండవ గోపీనాథ్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

టంగుటూరు, జనవరి 13 : టంగుటూరులో రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరుగుతాయని జమ్ములపాలెం జడ్పీ హైస్కూల్ పీడీ తులిబిల్లి అశోక్ శనివారం ఓ ప్రకటనలో చెప్పారు. రావూరి అయ్యవారయ్య మెమోరియల్ వారి సహకారంతో టంగుటూరు పురం సెంటర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలను మంత్రి ఆదిమూలపు సురేష్ చేతులు మీదుగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈపోటీలు డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట్స్ వెలుగులో నిర్వహిస్తామని, వివరాలకు 89195 91417 సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జనవరి 13: కారు ఢీకొన్న ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శనివారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం సమీపంలో జరిగింది. నెల్లూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ నడుపుతున్న అద్దంకికి చెందిన ఆర్.శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రేపు రామస్వామి జయంతి సభ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 13 : కవి, రచయిత, సాహితీ విమర్శకుడు, రాజకీయవేత్త త్రిపురనేని రామస్వామి 137వ జయంతి సదస్సు ఈనెల 15వతేదీ ఉదయం పదిగంటలకు ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరుగుతుందని హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ హేతువాది ముత్తేని రవీంద్రనాథ్, రచయిత బీరం సుందరరావు, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య, సీపీఐ నేత నల్లూరి వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో హేతువాద ఆలోచనాపరులు, అభ్యుదయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 13: జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే జంతు హింస నివారణ చట్టం కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రతి మండలంలో పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో నిఘా బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ బృందాలు పశుసంవర్ధకశాఖ సిబ్బంది సహకారంలో అన్ని గ్రామాల్లో నిఘా ఉంచారని, ఎవరైనా కోడి పందేలు నిర్వహించడం లేదా నిర్వహించేందుకు స్థలం ఇవ్వడం, ఏ రకంగానైనా సహకరించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకల్లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఒంగోలు(విద్య), జనవరి 13: ఐదుదశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ హైస్కూలులో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు పాఠశాలలో తమ అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ హెచ్ఎం, టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో కిరణ్‌వర్మ, జయశేఖర్, డాక్టర్ నిఖిలేష్, డాక్టర్ అఖీల తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రచయితల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రరసం అధ్యక్షులు వేంకటశ్రీనివాసులు, బెల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

గెలుపోటములు సమంగా తీసుకోవాలి

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి 13: క్రీడాకారులు గెలుపోటములు సమంగా తీసుకోవాలని ఎంపీడీవో జయమణి పేర్కొన్నారు. ఉప్పుగుండూరులో శనివారం ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ మాదాసు కృష్ణమూర్తి మెమోరియల్ వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, తహసీల్దార్ సుకుమార్, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, మాదాసు రాంబాబు, పెంట్యాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు ఉప్పుగుండూరు శ్రీనివాస ప్రసాదు, ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీఎస్ఎస్ హైస్కూల్ వజ్రోత్సవాలు



వేడుకలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి 13: ఎంతో మంది మేధావులను తయారు చేసిన పాఠశాలను, గురువులను ప్రతి ఒక్కరూ జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని డిప్యూటీ డీఈవో జె.అనితారోజ్‌రాణి పేర్కొన్నారు. నాగులుప్పలపాడు మండలం చేకూరపాడులోగల శ్రీవేణుగోపాలస్వామి సంస్కృత ఉన్నత పాఠశాల (ఎస్వీఎస్ఎస్) వజ్రోత్సవాలు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా అనితారోజ్‌రాణి హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ వడ్డెళ్ల భాస్కరరావు మాట్లాడుతూ 1962లో శిరిగిరి పేరయ్య ఈ పాఠశాలను స్థాపించారన్నారు. అనంతరం పేరయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూర్వ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల కమిటీ నాయకులు శిరిగిరి తారకనాథ్, శిరిగిరి శింగయ్య, కొమ్మినేని సత్యం, శిరిగిరి వెంకయ్య, వడ్డెళ్ల ప్రసాద్, కరణం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డ్వామా పీడీ శీనారెడ్డి

కొండపి, జనవరి 13 : ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ కె.శీనారెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా శీనారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పనుల కొలతల్లో కొద్దిగా తేడా లుంటే సర్దుకుపోయే వెసులుబాటు ఉందన్నారు. రాబోయే రోజుల్లో పనికి ముందు, జరిగేటప్పుడు, తర్వాత పటిష్టమైన తనిఖీలు ఉంటాయన్నారు. కొలతలు, మస్టర్లు, కూలీల్లో తేడాలుంటే నిర్దాక్షిణ్యంగా రికవరీలు ఉంటాయన్నారు. ఏపీవో, టీఏలు తప్పనిసరిగా పనులు పరిశీలించాలన్నారు. క్షేత్రసహాయకులను నమ్ముకుంటే టీఏల ఉద్యోగాలు ఊడిపోవడం ఖాయన్నారు. పలు గ్రామాల్లో మస్టర్ల లోపాలు, పని ప్రదేశంలో కొలతలు తగ్గడంతోపాటు, వలంటీర్లు పనులు చేయగా వారికి కూలి చెల్లించారని డీఆర్పీలు తమ నివేదికల్లో చదివి వినిపించారు. పూర్తి స్థాయి పరిశీలన అనంతరం రికవరీలు ఉంటాయని పీడీ స్పష్టం చేశారు. గతంలో ఆడిట్ అనంతరం ఒక టీఏ నుంచి రూ.1.80లక్షలు, మరో ఎఫ్ఏపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం రికవరీకి రాశామన్నారు. వారిని అప్పట్లోనే సస్పెండ్ చేశామన్నారు. మరో 12 వేల రూపాయలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ప్రజావేదికలో డ్వామా ఏపీడీ వెంకటస్వామి, ఎస్ఆర్పీ సుబ్బారావు, ఎంపీడీవో రమణమూర్తి, ఏపీవోలు వాసంతి, మహాలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ కవిత, టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న కంకణాల అంజనేయులు

అంగన్‌వాడీలపై నిరంకుశత్వం తగదు

కొండపి, జనవరి 13 : అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. కార్యకర్తల సమ్మెలో భాగంగా కొండపిలో కొనసాగుతున్న నిరసన శిబిరంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. జీతాలు పెంచేది లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడటాన్ని ఆంజనేయులు ఖండించారు. సలహాదారుల అదిరింపులకు, బెదిరింపులకు అంగన్‌వాడీలు వెనక్కి తగ్గుతారనుకోవడం వారి అవివేకమన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన ఉద్యమానికి ప్రజా మద్దతు కూడగడతామని, కోటి సంతకాలు సేకరిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ పేదలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే ఆహారం, వైద్యం దూరమవుతుంటే ప్రభుత్వం ఒంటెత్తు పోకడలు పోవడం మంచిది కాదన్నారు. కార్యకర్తలు, ఆయాల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు.



అన్నంబొట్లవారిపాలెంలో బండలాగుతున్న ఎడ్లు

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 13: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో 36వ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పది జతల ఎడ్లు పాల్గొన్నాయి. తొలుత బరిలోకి దిగిన తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట, హుజూనగర్‌కు చెందిన ఎస్‌పీ సుంకి సాకేత్ రెడ్డి, ఎస్ఎస్ఆర్ బుల్స్ సురేంద్రరెడ్డి కంబైన్స్ జత నిర్ణీత సమయం ముగిసేసరికి 2672 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, సీతా రాంపురానికి చెందిన సాయినంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ నారాయణరావుకు చెంది న ఎడ్లు 2345.6 అడుగులు, కడప జిల్లా వల్లూరికు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడు 2587.6 అడుగుల దూరం లాగాయి. పోటీలను తిలకించేదుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పశుపోషకులు పెద్దఎత్తున తరలి రావటంతో ప్రాంగణంలో సందడి వాతా వరణం నెలకొంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్లకుండా నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు, మర్రి నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.



కొండమంజులూరులో జరుగుతున్న క్రికెట్ పోటీలలో తలపడుతున్న చెన్నై, విజయవాడ జట్లు

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 13: మండలంలోని కొండమంజులూరులో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. శని వారం జరిగిన పోటీలలో విజయవాడపై చెన్నై, తిరువళ్ళూరుపై సిక్కో లు చేతాస్ శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో తిరువళ్ళూరుపై టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌట్ అయింది. 184 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టి న తిరవళ్ళూరు జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 148 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయింది. శ్రీకాకుళం జట్టులోని కిన్లే నాలుగు వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో ఎంఆర్‌సీసీ చెన్నై, విజయవాడపై 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన చెన్నై జ ట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. 160 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేప ట్టిన విజయవాడ జట్టు 130 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చవి చూసింది. చెన్నై క్రీడాకారుడు సెల్వకుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఆదివారం ఉదయం కేరళ, శ్రీకాకుళం జట్లు, సాయంత్రం ఎంఆర్ సీసీ చెన్నై, లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.

ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న మద్యం స్వాధీనం

టంగుటూరు, జనవరి 13 : ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 15 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఎస్సై ఖాదర్‌బాషా కథనం మేరకు.. జాతీయ రహదారిలో ఉన్న టోల్‌గేట్ వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో బెంగళూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో సోదాలు చేయగా అక్రమ మద్యం పట్టుబడింది. మద్యం బాటిళ్లు ఉన్న బ్యాగుతో దొరికిన పొదిలిలోని బాలాజీనగర్‌కు చెందిన మట్టె రాఘవులును అరెస్టు చేశారు.

వైసీపీని సాగనంపాలి

● నవరత్నాల పేరుతో దగాచేసిన సీఎం

● ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి/బల్లికురవ, జనవరి 13: నవరత్నాల పేరుతో సీఎం జగన్మోహనరెడ్డి నవ మోసాలకు పాల్పడుతున్నారని, అందరి భవిష్యత్ కోసం వైసీపీని వచ్చే ఎన్నికలలో ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలతో మార్టూరు మండలం జొన్నతాళి వద్ద ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం వేర్వేరుగా సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ, ఓటర్ల జాబితా పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటికి వెళ్ళి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలని నేతలకు ఎమ్మెల్యే రవికుమార్ సూచించారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదని, నిత్యావసర ధరలు మాత్రం బాగా పెరిగాయన్నారు. పెరిగిన గ్యాస్ ధరలతో కట్టెల పొయ్యిలపై వంట చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. అన్నా క్యాంటిన్‌లు తెరిపించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలుచేసిన 130 కి పైగా సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. టీడీపీని ఆదరిస్తుంది బీసీ లేనని చెప్పారు. బీసీలలో నాయకత్వాన్ని పెంపొందించింది కూడా టీడీపీయేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్‌లు తగ్గించి 16,800 పదవులకు బీసీలను దూరం చేసిందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో పేదలు మరింత పేదలు గా మారారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం జగన్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. రంగుల పిచ్చితో టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు పంచకుండా రోడ్డున పడేశారన్నారు. సర్వే రాళ్ళు, పట్టాదారు పాసుపుస్తకాలపై కూడా జగన్ తన బొమ్మలను వేసుకోవటం ఏమిటన్నారు. అందరి భవిష్యత్ కోసం వైసీపీని ఇంటికి సాగనంపి, రాష్ట్రానికి టీడీపీ, జనసేన పార్టీల స్వర్ణయుగం తీసుకువద్దామని నేతలు, కార్యకర్తలకు సూచించారు.

సమావేశాలలో టీడీపీ నేతలు కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, తిమ్మాయపాలెం నేతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, పరిటాల పవన్‌కుమార్, పరిటాల శ్రీనివాసరావు, సిద్దయ్య, అల్లంనేని కాశయ్య, బల్లికురవ మండల నేతలు పావులూరు సత్యనారాయణ, ఏడుకొండలు, సర్పంచ్ పందిరి అంజిబాబు, గొట్టిపాటి ఏడుకొండలు, బెల్లంకొండ సుబ్బారావు, బైరపునేని అజయ్, నాగబోయిన సింగారావు, తన్నీరు వీరాంజనేయులు, తిరుపతిరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాయపాలెం నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

సంక్రాంతికి కో 'ఢీ'

జిల్లా సరిహద్దుల్లో పలు చోట్ల పందేలు

గతంలోనూ పలుచోట్ల నిర్వహణ

అద్దంకి, జనవరి 13: సంక్రాంతికి కోడి పందాలు నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. గతంలోనూ పలుచోట్ల కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు. ప్రధానంగా జిల్లా, మండల సరిహద్దు ప్రదేశాలలో కోడి పందాల వేస్తుంటారు. ఈక్రమంలో అటు ప్రకాశం, ఇటు పల్నాడు జిల్లాల సరిహద్దులో కోడి పందాలు జరిగే అవకాశం ఉంది. అద్దంకి నియోజకవర్గంలో అత్యధిక శాతం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. సంతమాగులూరు మండలం లో పలుగ్రామాలు పల్నాడు జిల్లా సరిహద్దులో ఉండటంతో రెండు జిల్లాలకు చెందిన పందెంరాయుళ్లు కొన్నిప్రదేశాలను ఎంపిక చేసుకొని సెల్‌ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చుకొని అక్కడికి చేరుకొని కొద్ది గంటల వ్యవధిలోనే పందాలు ముగించుకొని వెళ్తుంటారు.

ఇక ప్రకాశం జిల్లా సరిహద్దులో అద్దంకి సర్కిల్ పరిధిలో ధేనువకొండ, రామాయ పాలెం తదితర ప్రాంతాలలో కోడి పందాల నిర్వహణకు అవకాశం ఉంది. గత ఏడాది అద్దంకి మండలం కొటికలపూడి, కుంకుపాడు మధ్య పొలాల్లో భారీ స్థాయిలో కోడిపందాలు వేస్తుండగా పోలీసులు మారు వేషాలలో వెళ్ళి పట్టుకున్నారు. పలు సందర్భాలలో కొత్తరెడ్డిపాలెం, ధర్మవరం, శంఖవరప్పాడు, కొటికలపూడి, ధేనువకొండ, రామాయపాలెంలో కూడా జరిగాయి. పంగులూరు, కొరిశపాడు మండలాల సరిహద్దులో కూడా పెద్ద ఎత్తున కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు. బల్లికురవ మండలం లో కూడా గతంలో పలుసార్లు కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు.



ఇలా ప్రతిఏటా ఏదో ఒక ప్రాంతంలో కోడి పందాలు జరుగుతూనే ఉన్నాయి. కోడి పందాలు జరిగే ప్రదేశానికి వచ్చే మార్గాలలో దూరంగా కాపలాగా మనుషులను ఏర్పాటుచేసి కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇచ్చేవిధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో పోలీసులు సాధారణ వ్యక్తులుగా వెళ్తే మినహా పట్టుబడటం కష్టంగా మారింది. కోడి పందాలు జరిగే ప్రదేశాలను అప్పటికప్పుడు ఫిక్స్ చేసుకుంటుండటంతో పోలీసు అధికారులకు సమాచారం వచ్చి అక్కడకు వెళ్ళేసరికే కోడి పందాలు పూర్తి చేసుకొని వెళ్ళిపోతున్నారు. దీనికితోడు మండలాల సరిహద్దు ప్రాంతాలను ఎంపిక చేసుకుంటుండటంతో ఎవరి పరిధి అని తెలుసుకొని వెళ్ళేలోపే పుణ్యకాలం పూర్తి అవుతుంది. ఈనేపథ్యంలో పోలీసు అధికారులు మరింత నిఘా పెట్టితే మినహా కోడి పందాలను అరికట్టడం సాధ్యం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సవాళ్లు...ప్రతి సవాళ్లు

● వైద్యశాఖలో ఉద్యోగి దురుసు ప్రవర్తన

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎన్‌జీవో నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 13 : శాఖ పరువు బజారున పడుతుందన్న కనీస జ్ఞానం లేకుండా దూషణలకు దిగడంపై తోటి ఉద్యోగులే అసహ్యించుకోనే పరిస్థితి వైద్యారోగ్యశాఖలో ఏర్పడింది. ఆ తిట్ల పురాణం వినలేక మహిళా ఉద్యోగులు కార్యాలయం నుంచి బయటకు పోయారు. కలెక్టరేట్‌లో ఉన్నామనే విషయాన్ని మరిచి నీవేంత అంటే.. నీవేంత అంటూ కేకలు పెట్టారు. అందిన సమాచారం మేరకు వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సురేషిణీ ఉద్యోగికి 2019లో పదోన్నతి కల్పించారు. అయితే దీనిపై ఇటీవల కడప జిల్లాకు చెందిన ఒకరు ఆరు నెలల క్రితం సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరారు. అటెండర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగికి దివ్యాంగుల కోట కింద పదోన్నతి కల్పించారని ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని నిర్ధారించారు. అయితే ఆ మహిళా ఉద్యోగి ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకుండా ఆ మహిళా ఉద్యోగినిని రివర్షన్ చేయడంతో ఆమె ఎన్‌జీవో నేతలను ఆశ్రయించారు. దీంతో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్‌బాబు, కృష్ణారెడ్డిలు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓతోపాటు సంబంధిత సూపరింటెండెంట్ శ్రీనివాసరావును కలిశారు. ఆ సమయంలో సూపరింటెండెంట్, ఎన్‌జీవో సంఘం నేతల మధ్య మాటా మాట పెరిగింది. ఆ సమయంలో సహనం కోల్పోయిన సూపరిటెంటెంట్ కనీసం మహిళా ఉద్యోగులు తమ కార్యాలయంలో ఉన్నారన్న విషయాన్ని మరిచి అసభ్యపదజాలంతో చిందులు వేశారు. దీంతో ఎన్‌జీఓ సంఘం కార్యదర్శి కృష్ణారెడ్డి కూడా అదేస్థాయిలో మండిపడ్డారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయకుండా ఇష్టారీతిన వ్యవహరించడమే కాకుండా దౌర్జన్యం చేయడంతో ఉద్యోగసంఘం నేతలు అదేస్థాయిలో తిరగబడ్డారు. సవాళ్ళు ప్రతి సవాళ్లతో ఆ కార్యాలయం దద్దరిల్లింది. అయినా సంబంధిత అధికారి తనకు ఏమి తెలియదన్నట్లుగా వ్యవహరించారు. పదోన్నతుల సమయంలో తప్పులు చేసింది ఎవరని ఎన్‌జీవో నేతలు ప్రశ్నించారు.

నాలుగేళ్లపాటు పనిచేసిన ఉద్యోగికి రివర్షన్ ఏ విధంగా ఇస్తారని మండిపడ్డారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి ఎన్‌జీవో సంఘం నేతలు తీసుకెళ్లారు. ఆ ఉత్తర్వులపై కలెక్టర్ ఇచ్చిన సూచనలను కూడా వైద్యశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకోకపోవడంపై ఎన్‌జీవోలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుటే టెంటు వేసి ఆందోళనలు చేసేందుకు వెనుకాడేది లేదని ఎన్‌జీవో నేతలు హెచ్చరించారు.

ఘనంగా గిరిప్రదక్షిణ

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: ఒంగోలులో శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రవణానక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక శ్రీబాపూజీ గోసంరక్షణ సంఘం నుంచి మొదలైన గిరిప్రదక్షిణలో మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామాన్ని జపించారు. జిల్లా గ్రంథాలయం, కేశవస్వామిపేట, భగీరథసర్కిల్, శర్మా కాలేజీ, గద్దలగుంట, రాజాపానగల్ రోడ్డు మీదుగా జయరాం సెంటర్ ద్వారా శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రాధారమణ గుప్తా జంధ్యం మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం దిగ్విజయంగా జరుగుతున్నదన్నారు. కాగా కమిటీ నాయకులు తూనుగుంట మల్లిఖార్జున రావు, నేరెళ్ల శ్రీనివాసరావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, కోటి సూర్యనారాయణ, ధనిశెట్టి రామునాయుడు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

సంక్రాంతి కానుక పంపిణీ

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ సభ్యులకు వివిధ రకాల వస్తువులను సంక్రాంతి కానుకగా పంపిణీ చేశారు. స్థానిక గాంధీ నగర్ రామాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లిఖార్జున రావు మాట్లాడుతూ ఇక్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ షేక్ షాకీర్, షేక్ అక్బర్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం ఆధ్వర్యంలో బ్రాహ్మణులకు ఉపయోగపడే వాటర్‌బాటిల్, క్యాలెండర్, తెలుగు డైరీ తదితర వస్తువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు శివదేవుని మురళీధర్, డాక్టర్ లంకా ప్రసన్నకుమార్, పి.నరసింహారావు, గొల్లపూడి శాస్త్రి, వరప్రసాదశర్మ, శంకరమంచి శ్రీధర్‌శర్మ, దొనపాటి ఫణశర్మ, రఘురామశర్మ, కె.ప్రసాదశర్మ పాల్గొన్నారు.

నిరుపేదల్లో సంతోషమే నిజమైన సంక్రాంతి

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: సమాజంలో నిరుపేదలు సైతం సంతోషంగా జీవించినప్పుడే నిజమైన సంక్రాంతి అని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక కర్నూల్‌రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఆయన నిరుపేదలకు లక్ష రూపాయల విలువైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్‌బాషా, షహనాజ్‌ల ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు తదితర వస్తువులను అందజేశారు. పేదలు కూడా ఆనందంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్మార్ట్ ఐఎంఎస్ నిర్వాహకులు పి.చెన్నకేశవ రెడ్డి, డాక్టర్ చాపల వంశీకృష్ణ, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, కోసూరి శ్రీదేవి, షేక్ మహబూబ్, బొడ్డపాటి వెంకట్, రాయపాటి రవికిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సరుకులను అందజేస్తున్న నిర్వాహకులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీ ఒంగోలు వాసి మృతి

పూతలపట్టు, జనవరి 13: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఒంగోలుకు చెందిన రాజేష్, చిన్న మాలకొండయ్యలు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు పని నిమిత్తం శనివారం రాత్రి పది గంటలకు పొలకల సంతగేటుకు ద్విచక్ర వాహనంలో వెళుతూ పాటూరు దళితవాడ వద్దకు రాగానే, అదే దళితవాడకు చెందిన నారాయణ ద్విచక్ర వాహనంలో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చిన్న మాలకొండయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఒంగోలు (కల్చరల్), జనవరి 13: గుడ్‌మార్నింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక చెన్నకేశవ లేఔట్ వద్ద ఏర్పాటుచేసిన ముగ్గులపోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలలో దాదాపు 75 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. అదేవిధంగా పొంగళ్లు, గంగిరెద్దుల ఆటలు, కోలాటాలు మొదలైన కార్యక్రమాలు సైతం అలరించాయి. అనంతరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దామచర్ల నాగసత్యలత, డాక్టర్ కామేపల్లి సుబ్రహ్మణ్యేశ్వరి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బెజవాడ వెంకట్రావు, మాలెంపాటి కృష్ణారావు, కోగంటి గోపాలకృష్ణ, చెన్నుపాటి వరప్రసాద్, మండవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు



విజేతలకు బహుమతులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి ఆదిమూలపు సురేష్



ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్, ఐవీ సుబ్బారావు, యూనియన్ నాయకులు

సింగరాయకొండ, జనవరి 13 : జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక గంజి కల్యాణ మండపంలో శనివారం ఏపీయూడబ్ల్యూజే కొండపి నియోజకవర్గ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏపీయూడబ్ల్యూజే కృషితోనే జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయింపు జరగబోతున్నదన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభంగా ఉన్న మీడియా వాస్తవాలను ప్రజల ముందుంచే క్రమంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తున్నదన్నారు. వాటిని అధిగమించి సమాజహితం కోసం జర్నలిస్టులు పనిచేయాలని సూచించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు తన దృష్టికి తీసుకొచ్చిన విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు సింగరాయకొండలో నివేశన స్థలాలు ఇచ్చేందుకు ఉన్న అవకాశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు కేశవరపు జాలిరెడ్డి పాల్గొన్నారు.



వేములకోటలో 'బాబుష్యూరిటీ'

● పాల్గొన్న నారాయణరెడ్డి తనయుడు



అభివాదం చేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

మార్కాపురం రూరల్, జనవరి 13 : మండలంలోని వేములకోట గ్రామంలో శనివారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్న టీడీపీ జనసేన ప్రభుత్వం రావాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, టిడిపి నాయకులు జంకె మోహన్‌రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని సొంతూరిలా అభివృద్ధి చేస్తా

కార్యకర్తల సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

కొమరోలు, జనవరి 13: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని తన స్వగ్రామంలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి నివాసంలో శనివారం మండలస్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబం కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటుందన్నారు. కార్యకర్తలకు సమస్యలు వస్తే ఎంతవరకైనా వెళ్లి పోరాడతానని వారిలో ఉత్తేజం నింపారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోనే కొమరోలు మండలంలో అధిక ఓట్లు టీడీపీకి పడాలన్నారు. ప్రస్తుతం పార్టీలో ఎవరైతే క్రియాశీలకంగా వ్యవహరిస్తారో వారికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామాల్లో కుటుంబ సాధికారక కమిటీ సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లోని 30 కుటుంబాలకు ఇద్దరు కుటుంబ సాధికార కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. వారి పరిధిలోని అన్ని గృహాలకు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' బాండ్లు అందజేయాలన్నారు. ముఖ్యంగా మహిళలకు మహాశక్తి, రైతు పథకాలు, యువగళం, బీసీ రక్షణ చట్టం, ఇంటింటికి సురక్షిత మంచినీరు, పూర్ టూ రిచ్ వంటి పథకాలను చంద్రబాబునాయుడు పొందుపరిచారన్నారు. వాటివల్ల ఒక్కో కుటుంబానికి చేకూరే లబ్ధిని వారికి వివరించాలన్నారు. కార్యాక్రమంలో జిల్లా రైతు కార్యదర్శి వీవీ రాఘవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, జిల్లా రైతు నాయకులు బిజ్జం రవింద్రారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ నబీ, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్, నాయకులు కృష్ణమోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, వేణమ్మ, గంగయ్య, నాగేశ్వరరెడ్డి, డి శ్రీనివాసరెడ్డి, షైలగాని సత్యం, లక్ష్మీనరసయ్య, జ్యోతిరెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి, గోపాలకృష్ణయ్య, శ్రీనివాసచౌదరి, రఘువర్మరాజు, దనిరెడ్డి మోహన్‌రెడ్డి, లాయర్ విజయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిరంగారెడ్డి, యల్లారెడ్డి, గురుస్వామిరెడ్డి, దూదేకుల రంతూ, బోడ్డు రంగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 13 : బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, రాష్ట్రంలో ప్రజలు టీడీపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని, బీసీలు అందరూ టీడీపీకి ఓట్లు వేసి విజయం చేకూర్చాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం శనివారం సాయంత్రం పోతురాజు వీదిలో బాబు ష్యూరిటి భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

టీడీపీలో చేరిక

మండలంలోని తిరుమలగిరి కాలనీలో 30 చెంచుగిరిజన కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆ పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చిట్యాల వెంగళరెడ్డి, కాకర్లకోటయ్య, చెవుల అంజయ్య, కంచర్ల సత్యనారాయణగౌడ్, తోట మహేష్, పేరం రమణారెడ్డి, కొత్త భాస్కర్ ఉన్నం నరసింహారావు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, ఈదన్న పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోపై అవగాహన

గిద్దలూరు టౌన్ : ప్రతిబూత్ ఇన్‌చార్జిలు టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి కుటుంబానికి చేరువ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం గిద్దలూరులోని పార్టీ కార్యాలయం నందు మండల పార్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ సర్పంచులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీ, ఎస్సీల సంక్షేమం

గిద్దలూరు టౌన్ : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీ, ఎస్సీల సంక్షేమం సాధ్యమవుతుందని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొంగలవీడు గ్రామంలోని బీసీ, ఎస్టీ కాలనీలలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అశోక్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అన్నివర్గాల సంక్షేమం ఒక్క టీడీపీ, జనసేనలతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, కొంగలవీడు సర్పంచ్ పందనబోయిన లక్ష్మీప్రసన్న, టీడీపీ నాయకులు రాజ భూపాల్‌యాదవ్, పవన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌యాదవ్, జి.ఎం.వలి, స్వామిరంగారెడ్డి, రఘునాథరెడ్డి, పిచ్చయ్య, బాలక్రిష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షాన్వావలి, బిల్లా రమేష్‌యాదవ్, శేషగిరి, పందీటి రజనీబాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేద్దాం

వైపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

మార్కాపురం రూరల్ జనవరి 13: నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా పని చేసి రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించుకోవాలని వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిపత్రి చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని కళాశాల రోడ్డులోని సెవెన్ హిల్స్ లాడ్జిలోని మీటింగ్‌హాల్లో శనివారం ఎర్రగొండ పాలెం నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలోని ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల, పుల్లల చెరువు మండలాలోని కార్యకర్తలు హాజరుకాగా వారిని ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా తాడిపత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీలోని ప్రతి వ్యక్తిని కలుపుకు పోతానన్నారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల, పుల్లలచెరువు మండలాల మండలాల ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దారవీడు నాయకులు డుమ్మా

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించి పరిచయ కార్యక్రమం నిర్వహించిన పరిచయ కార్యక్రమానికి పెద్దారవీడు ఎంపీపీ, జడ్పీటీసీ, పార్టీ మండల కన్వీనర్లు హాజరు కాలేదు. నియోజకవర్గంలోని అందరు ముఖ్య నాయకులు హాజరై పెద్దారవీడు మండల నాయకులు హాజరు కాకపోవడంపై ఆ పార్టీ నేతల్లో చర్చ జరిగింది. చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో పెద్దారవీడు మండల నాయకుల ఫోటోలు వేయలేదని అలిగినట్లు నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలను వైసీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పరిచయం చేసుకున్నారు. ఈనెల 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహవిష్కరణ కార్యక్రమంలో ప్రతి సచివాలయం నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలు విజయవాడ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆ పార్టీలోని పలువురు మండల స్థాయి నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు ఆయన్ను కలిసి వెళ్లారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

మద్యం సీసాల స్వాధీనం

మార్కాపురం రూరల్ జనవరి 13: మండలంలోని కోమటికుంట, పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ కుంట వద్ద బస్సుల్లో తరలిస్తున్న 16 మద్యం సీసాలను శనివారం సెబ్ అధికారులు తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి బస్సులలో అక్రమంగా మద్యం తరలిసున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి బస్సులో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి వద్ద నుండి రెండు ఫుల్ బాటిల్‌లు, రెండు ఆఫ్ బాటిల్‌లు, ఒక క్వాటర్ సీసా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక బెంగళూరు నుంచి బస్సులో తీసుకొని వస్తున్న వ్యక్తి వద్దనుండి 11 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

22 మద్యం సీసాల స్వాధీనం

గిద్దలూరు టౌన్, జనవరి 13 : అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారరం అరెస్టు చేశారు. ఆయన వద్ద నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో రామయ్య అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు.

యాదవ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ


గిద్దలూరు టౌన్, జనవరి 13 : నియోజకవర్గంలోని యాదవ ఉద్యోగుల క్యాలెండర్‌ను డాక్టర్ బీవీ.రంగారావు ఆవిష్కరించారు. పట్టణంలోని రంగారావు ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ బీవీ.రంగారావు మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యమత్యంతో పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేయాలన్నారు. ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మొర్రి పిచ్చయ్యయాదవ్ మాట్లాడుతూ కులంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్నత చదువులు చదువుకోలేని వారికి చేయూతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, బేస్తవారపేట జడ్పీటీసీ సభ్యుడు బండ్లమూడి వెంకటరాజు, ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు, యాదవ సంఘం నాయకులు ఒ.వెంకటయ్య, చల్లా రవికాంత్, చల్లా వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మార్కాపురం రూరల్ జనవరి 13: మండలంలోని కొత్తపల్లి, గొట్టిపడియ గ్రామాలలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఎంపీడీవో చందన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవరత్నం, గ్రామసర్పంచి శ్రీరాములు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ.కృష్ణారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంగన్‌వాడీల మానవహారం

గిద్దలూరు, జనవరి 13 : డిమాండ్ల పరిష్కారం కోసం 33 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక నేషనల్ హైవే రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, విజయలక్ష్మి, వరలక్ష్మీ, దేవమ్మ, సిఐటియు నాయకులు టి.ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టీడీపీ జనసేన మద్దతు

సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. స్థానిక సచివాలయం ఎదుట అంగన్‌వాడిలను జనసేన పార్టీ నాయకులు కలిసి సంఘీభావం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించకుండా జగన్‌రెడ్డి ఎస్మా చట్టాన్ని ఏవిధంగా ప్రయోగిస్తాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో త్వరలో జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామని అంగన్‌వాడిలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన రాచర్ల అధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి, జనసేన నాయకులు కిరణ్, అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ధృతరాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి

మార్కాపురం వన్‌టౌన్ : తమ సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తు కళ్లు మూసుకున్న ధృతరాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవాలని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నా నిరసన దీక్షలు శనివారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. వామపక్ష నాయకులు, అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద 32 రోజులుగా అంగన్‌వాడీలు ఉద్యోగభద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ, భీమా సౌకర్యం ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమ్మెలో సీఐటీయూ నాయకులు సుబ్బమ్మ, వెంకటలక్ష్మీ,వెంకటరత్నం, షేక్ ముంతాజ్‌బేగం, సుహాసిని, పద్మ,రాణి, కుమారి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : జీతాలు పెంచమని సమ్మె చేస్తుంటే ఎస్మాచట్టం ప్రయోగించి బెదిరించడం ప్రభుత్వంలో ఆలజడికి నిదర్శనమని ఎర్రగొండపాలెం ఎన్జీవో హోం ఆవరణలో శనివారం ధర్నా శిబిరంలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో అంగన్వాడీయూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి సుబాషిణి,నాగరాజకుమారి, రామ సుబ్బమ్మ, అరుణ,సునీత, టి. సుబ్బమ్మ,సుజాత, పాల్గొని మాట్లాడారు. ఎర్రగొండపాలెం,త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలనుంచి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాలో పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రిపబ్లిక్‌డే వేడుకలకు ఆహ్వానం

గిద్దలూరు టౌన్, జనవరి 13 : దేశరాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.రాంభూపాల్‌రెడ్డి దంపతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. దేశప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా రాంభూపాల్‌రెడ్డిని గుర్తించి 100 మంది విశిష్ట వ్యక్తులకు పంపిన ఆహ్వానంలో ఆంధ్రప్రదేశ్ నుండి ఆరుగురికి అవకాశం వచ్చింది. ప్రకాశం జిల్లా నుండి రాంభూపాల్‌రెడ్డి ఆ గౌరవం దక్కించుకున్నారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో కూడా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ సదస్సుకు కూడా ఆహ్వానం అందింది.



రాంభూపాల్‌రెడ్డి దంపతులు

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాలునాయక్

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 13: మార్కాపురం ఆరవ అదనపు జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఆర్.బాలునాయక్ ఏపీ స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అసోసియేషన్ కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ కమిటీలో బాలు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయ వాదులు అభినందించారు.



మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 13: మార్షల్‌ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ చేకూరుతుందని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే మార్షల్ ఆర్ట్స్ స్కూల్ నిర్వాహకులు మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు హుస్సేన్‌బాషా, యాసిన్‌బాషా, జోయాసిద్దికి, ముస్కాన్, షకీల్, భార్గవ్, శివ, జస్వంత్‌రెడ్డిలతో పాటు కరాటే మాస్టర్ తోట ప్రసాద్‌లు ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వైభవంగా చెన్నకేశవస్వామి శాంతికల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 13: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశ స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం శాంతికల్యాణం నిర్వహించారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అనంతరం మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. ధనుర్మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజర య్యారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. శివాజీనగర్ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



కల్యాణ మూర్తిగా చెన్నకేశవుడు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కంభం, జనవరి 13 : శనివారం శ్రావణనక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పద్మావతి, అన్నపూర్ణదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుపండువగా నిర్వహించారు. మొదట కౌతుక ధారణ, పట్టువస్త్రాల సమర్పణ, మాంగళ్యధారణ, తలంబ్రాలు పోసి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గుడి ఉత్సవం నిర్వహించారు.

పేదలకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ

మార్కాపురం రూరల్ జనవరి 13: పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు పంచాయతీలోని కాశీనాయన ఆశ్రమంలో పేదలకు శనివారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమానికి ఎన్నోవిధాలా సహకరిస్తున్న షైన నాగిరెడ్డి తోడ్పాటుతో సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ కనకదుర్గ శ్రీకాశీ నాయన ఆశ్రమం కమిటీ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి కుందరు బాలిరెడ్డి, కమిటీ సభ్యులు రావి చెంచిరెడ్డి, వెన్న వెంకటరెడ్డి, కుందురు రమణారెడ్డి, గోగిరెడ్డి నారాయణరెడ్డి, తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

పల్లెకు పండగొచ్చింది

- సొంత ఊళ్లకు చేరుకుంటున్న కుటుంబాలు
- ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు
- కిరాణా, వస్త్ర దుకాణాలు కిటకిట
- భోగి మంటకు సిద్ధం

కనిగిరి, జనవరి 13 : ఇంటిల్లపాదీ, బంధువులతో సంక్రాంతి పండుగ సందడి..సందడిగా జరుపుకునే పండుగ. మూడు రోజులపాటు తెలుగువారు జరుపుకునే (భోగి, సంక్రాంతి, కనుమ) పెద్ద పండుగగా పేరున్న పండుగే సంక్రాంతి. అంతేకాకుండా పంటల పండుగ, వంటల పండుగ, ముగ్గుల పండుగ అని కూడా పేరున్న పండుగ సంక్రాంతి. అందులో తొలి రోజు భోగి పండుగకు అత్యంత విశిష్టత ఉంది. చిన్న, పెద్ద కలసి భోగి మంటలు వేసి ఆ మంటల్లో పాత వస్తువులతో పాటు ఇప్పటికి వరకు వారి వారి జీవితాల్లో ఎదురైన చేదు గుర్తులను కూడా మంటల్లో వేస్తారని నానుడి. పెద్ద ముగ్గు వేసి ఆ ముగ్గులో పెద్దపెద్ద చెక్కలతో, మొద్దులతో పేర్చి మంటలు వేస్తారు. చాలా మంది ఆ మంటల్లోనే వేడి నీటిని కాల్చుకుని శరీర శీతలాన్ని తగ్గించు కుంటారు. అందులో భాగంగా భోగి మంటల్లో వేసే సామగ్రి కోసం చిన్నారులైతే మరింత ఉత్సాహం చూపుతారు. ఎక్కడెక్కడ ఉన్న మొద్దులను, చెట్ల మండలను, తాటాకులను, చిల్ల కంపను సేకరిస్తారు. సేకరించిన వాటిని భోగి మంటలు వేసి చిన్నారులు ఎంతో ఆనందాన్ని పొందుతారు. అందుకు నిదర్శనంగా చిన్నారులు భారీ చెట్టు మొద్దులను ఎంతో కష్టంగా మోసుకెళ్తుండడం కన్పించింది.

పామూరు : గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కుటుంబ సభ్యులతో సొంత గ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంటా పిండి వంటల వాసన గుభాళిస్తోంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రాలతో పాటు, నిజామబాద్, కరీంనగర్ మెట్‌పల్లి కోరుట్లతో పాటు విజయవాడ, గుంటూరు, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పనుల కోసం వలస వెళ్లినవారు సైతం సంక్రాంతి పండుగ కోసం ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు చేరుకుంటున్నారు. మండలంలోని దూబగుంట, వగ్గంపల్లి, రావిగుంటపల్లి, తూర్పుకోడిగుడ్లపాడు, నట్టుమడుగు, బొట్లగూడూరు, ఇనిమెర్ల, నుచ్చుపొద, చిలకూరు. బొట్లగూడూరు. వీరభద్రాపురం, లక్ష్మీనరసాపురం, పడమటకట్టకిందపల్లి, మోపాడు, అయ్యన్నకోట, అయ్యవారిపల్లి, కోడిగుంపల, బోడవాడ, బుక్కాపురం, నర్రమారెళ్ల, సుబ్బక్కపల్లి, గ్రామాల ప్రజలు వంటల కోసం పిండి మర వద్దకు వచ్చి పిండిని పట్టించుకుంటున్నారు. కిరాణా దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. వస్త్ర దుకాణాలవద్ద బారుల తీరి కన్పిస్తున్నారు. మరోపక్క ఆదివారం భోగి పండుగ కావడంతో కంప సేకరణలో యువత తలమునకలయ్యారు. తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతిని వేడుకగా, ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే క్రీడా, ముగ్గుల పోటీలను గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. విజేతలకు పండుగ రోజు బహుమతుల అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సందడే సందడి

ముండ్లమూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు రెండు రోజుల నుంచి పిండి వంటల్లో మహిళలు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కంప్యూటర్ యుగంలో కూడా పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం రెండు, మూడు ఇళ్ల మహిళలు ఒక చోటకు వచ్చి పిండి కొట్టి అరిసెలు చేస్తున్నారు. ముండ్లమూరులో కావూరు సునీత అనే బీఈడీ విద్యార్థిని తన వంటతో ఘుమఘుమలాడిస్తోంది. అరిసెలు, చక్రాలు, చెక్కలు, గవ్వలు ప్రతి ఇంటా చేస్తున్నారు.



భోగి మంటల కోసం మొద్దును మోసుకెళ్తున్న చిన్నారులు



ముండ్లమూరులో అరిసెల కోసం పిండి కొడుతున్న మహిళలు

పల్లెల్లో సంక్రాంతి కళ

తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతికి సొంత ఊళ్లకు బంధువుల రాకతో పండుగ కళ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారు ఆదివారం భోగి పండుగ కావడంతో శనివారమే ఇళ్లకు చేరుకున్నారు. ఏ వీధిలో చూసినా బంధువులతో నిండి పోయింది.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

ఉత్సాహంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నీ

- టీడీపీ, జనసేన, ఉగ్ర యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ

పామూరు, జనవరి 13 : మైత్రి కోసం క్రికెట్ టోర్నమెంట్ అనే నినాదంతో ఉగ్ర యూత్ ఫోర్స్ పేరుపై సంక్రాంతి పండుగ సందర్భంగా టీడీపీ, జనసేన పార్టీల సౌజన్యంతో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో తూర్పుకోడిగుడ్లపాడు రోడ్డులోని ఎర్రమట్టి గ్రౌండ్స్‌లో శనివారం క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. క్రీడలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టోర్నీలో 45 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి మ్యాచ్‌లో పేట లెవన్ జట్టుపై అక్షర లెవన్ జట్టు గెలిచింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ బహుమతిని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అందచేశారు. టోర్నమెంట్‌లో గెలిచిన జట్లకు ఈనెల 18న టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతి రోజున బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శులు, ఆర్ఆర్ రఫీ, వై.రహీముల్లా, పట్టణ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఎప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, ముబినామౌలాలి, మస్తాన్, పువ్వాడి వెంకటేశ్వర్లు, చినహజరత్ ఎం.రమణయ్య, దేవరపు మాల్యాద్రి, మస్తాన్, ఎం.నరసింహారావు, కావేరి రసూల్, జనసేన నాయకులు, సంధాని, గోస్టు సునీల్, పగడాల మాలి, నాయకులు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన పార్టీ మండల అధ్యక్షుడు

దొనకొండ, జనవరి 13 : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాన్‌ను దొనకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుండాల నాగేంద్రప్రసాద్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మండలంలో జనసేన పార్టీ అభ్యున్నతికి బాధ్యతగా పనిచేయాలని ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపుకో సం అహర్నిశలు కృషి చేసి భారీ మెజార్టీ లక్ష్యంగా గ్రామాల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధినేత పవన్ సూచించారని, మండలంలో జనసైనికుల పనితీరును అధినేతకు వివరించినట్లు నాగేంద్రప్రసాద్ తెలిపారు.



పవన్‌తో నాగేంద్రప్రసాద్

వైభవంగా అయ్యప్ప పడిపూజ

పామూరు, జనవరి 13 : అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం పడి పూజ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు చిమట పట్టాభిస్వామి, కార్తికేయ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గుంటుపల్లి చెంచురామయ్య కుటుంబ సభ్యులు స్వామి ఉత్సవ విగ్రహంతో దేవస్థాన ప్రాంగణంలో ప్రదక్షణాలు చేసి పడి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు శివకోటేశ్వరరావు

ఎన్టీఆర్ కబడ్డీ పోటీలు ప్రారంభం

దొనకొండ, జనవరి 13 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఒబ్బాపురం యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మొదటి మ్యాచ్ దిగిన పోలేపల్లి, గంగదేవిపల్లి క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకున్నారు. శివకోటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్న ఒబ్బాపురం యూత్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ గుడిపల్లి థామస్, వార్డు సభ్యుడు బొందల రాజు, టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, కుందుర్తి లక్ష్మణ్, చెన్నుబోయిన సుబ్బారావు, వల్లపునేని కేశవ, బీపీ సైరస్, బొందల చిన్న మరియదాసు, ఒబ్బాపురం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను మోసగిస్తున్న వైసీపీ



ధర్నాలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, టీడీపీ నేతలు

దర్శి, జనవరి 13 : అంగన్‌వాడీ కార్యకర్తలను నమ్మించి వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధన కోసం గత 33 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో బాగంగా ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేస్తున్న కార్యకర్తల వద్దకు వెళ్లి టీడీపీ నాయకులు మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి కనీసం ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కార్యకర్తలను మోసం చేశారని విమర్శించారు. న్యాయబద్ధంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై చర్యలు తీసుకునేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించాలని చూడటం దారుణమన్నారు. వైసీపీ అసమర్థపాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగా తిరుపతిరావు, జిల్లా తెలుగు మహిళా నాయకురాలు ఎం.శోభారాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, నాయకులు కనకం సైదా, జూపల్లి కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పసుపులేటి దత్తాత్రేయ, ఇ త్తడి దినకర్, యూనియన్ నాయకులు తిరుపతమ్మ, ఆర్.అజిత, కె బాలమ్మ, జయమ్మ, ప్రశాంతి, షేక్ ఫాతిమా పాల్గొన్నారు.

108 మందికి కంటి పరీక్షలు

కనిగిరి, జనవరి 13: కంటి సంబంధ బాధితులకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జనని చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో కంటి సంబంధ బాధితులకు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. గతంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులతో పాటు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సోనాలిబెహ్రా, సుభాష్, సుధీర్, చిన్మయ్ వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. క్యాంపులో 108 మంది కంటి సంబంధ బాధితులు కంటి పరీక్షలు చేయించుకున్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలి

కనిగిరి, జనవరి 13: ఆసుపత్రి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మర్మతులకు గురైన భవన ప్రదేశాలను శనివారం చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్లాబ్ పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉండడంతో ఆయా మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.32లక్షలు మంజూరు చేసినట్లు చైర్మన్ తెలిపారు. రోగులకు అందుతున్న సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాంను అడిగి తెలుసకున్నారు. నాశిరకంగా పనులు చేస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ప్రభుత్వాసుపత్రిలో మత్తు డాక్టర్ లేక ఆపరేషన్‌లు జరగలేదని, ఇప్పుడు చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. చైర్మన్ వెంట ఏఎంసీ డైరెక్టర్ చమిటిశెట్టి శ్రీనివాసులు, నాయబ్‌రసూల్, పసుపులేటి అరుణోదర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

కురిచేడు, జనవరి 13: లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో శనివారం రోడ్డు పక్కన ఎండలో రోజువారీ పనులు చేసే వారికి ఎండ తగలకుండా ఉండేందుకు గొడుగులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా లయన్ల క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావు గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా రమణారావురావు మాట్లాడుతూ పేదలకు లయన్స్ ఎన్నో సేవలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జేబీ రామారావు, గ్రంధిశిల అల్లూరి నాగరాజు, యెలిసెట్టి రంగనాయకులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం..!

- ఆ వర్గాలకు అన్యాయం చేసిన జగన్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



బీసీ కరపత్రాలను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే ఉగ్ర, బీసీ సంఘ నేతలు

కనిగిరి, జనవరి 13 : బీసీలకు తెలుగుదేశం పార్టీతోనే సముచిత స్థానం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా శనివారం బీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో బీసీలకు ఎంతో మేలు చేకూర్చారన్నారు. బీసీల్లోని వివిధ ఉప కులాలకు చెందిన వారి ఆర్థిక పురోగతికి చేతి వృత్తుల ఆధారంగా వారికి పనిముట్లను అందించారన్నారు. దాంతో పాటు వారికి ప్రభుత్వం ద్వారా రుణాలు మంజూరు చేయించి వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అదేవిధంగా వారి కుటుంబాల్లోని విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక రాయితీపై రుణాలు మంజూరు చేయించారన్నారు. మత్స్యకార వర్గాలకు వలలు, పడవలు, ఇతర పరికరాలను 90 శాతం సబ్సిడీతో పరికరాలు అందించారన్నారు. చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లల వదిలి వాటి వేట హక్కులు కల్పించారన్నారు. చేనేత కార్మికులకు రూ.200 నుంచి రూ.2000కు పెన్షన్‌ను పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. వారి నివాసాలకు 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను ఇచ్చారన్నారు. బోయలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా రూ.12కోట్లు రుణాలు మంజూరు చేయించారన్నారు. అంతేకాకుండా ఎస్టీల్లో బోయలను చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం కూడా చేసినట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు 90 శాతం సబ్సిడీతో సెలూన్ల యూనిట్లు, పరికరాలు, ఇస్త్రీ పెట్టెలు, వాషింగ్ మిషన్లు, దోబీ ఘాట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో 821 దోబీఘాట్లు ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ వంటి సంక్షేమాలకు రూ.166కోట్లు వెచ్చించినట్లు గుర్తు చేశారు. గీతకార్మికులకు, కురబలకు, యాదవులకు ఇలా ప్రతి బీసీ వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు సంక్షేమాన్ని అందించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. బీసీలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించి అసెంబ్లీలో తీర్మానం కూడా చేసి కేంద్రానికి పంపిచినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. కానీ వైసీపీ వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఎన్నడైనా బీసీల అభివృద్ధికి జగన్ ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఒక్క చాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశారని డాక్టర్ ఉగ్ర మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించిన బీసీ వర్గాలపై దాడులకు తెగబడి తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతున్నారన్నారు. తాజాగా బీసీపై ప్రేమ ఒలగబోస్తున్నారని ఉగ్ర ఎద్దేవా చేశారు. బీసీలకు చెందిన అన్ని వర్గాలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని కోరారు. టీడీపీలోని బీసీ నాయకులందరూ కలసికట్టుగా ప్రజల్లో పర్యటించి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టే అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం జయహో బీసీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు డీ శివ కాశయ్య, బ్రహ్మంగౌడ్, తిరుపాలు, లక్ష్మయ్య, కాసుల శ్రీరాంయాదవ్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీధి లైట్లూ వేయలేని దుస్థితిలో పాలన..!

- సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?
- ప్రజలకు సేవ చేయాలన్న కోరిక నెరవేరడం లేదు
- సర్వసభ్య సమావేశంలో వైసీపీ సభ్యుల ఆవేదన



సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

దొనకొండ, జనవరి 13 : ప్రజా సమస్యలను పరిష్కరించని సమావేశాలు ఎందుకని, కనీసం వీధి లైట్లూ వేయలేని దుస్థితిలో పాలన ఉండడం దౌర్భాగ్యమని దొనకొండ వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గుంటూ అమ్మాజీ, సంగాపురం సర్పంచ్ భీమనేని వెంకటేశ్వర్లు సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బొ రిగొర్ల ఉషామురళి అధ్యక్షత న శనివారం ని ర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి శా ఖల పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను గురించి తెలిపారు. ఈ సందర్భంగా దొనకొండ ఎంపీటీసీ సభ్యులు అమ్మాజీ మాట్లాడు తూ చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావటం లేదని, దొనకొండలో కోతుల బెడద తీవ్రమై ప్రజలు ఇబ్బందులు పడుతుండడం, కొందరు వీటి దాడికి గురై గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. బ్రహ్మారావుపేటలో వీధిలైట్లు వెలగడం లేదని చెపితే ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని కనీసం వీధిలైట్లు వేయించలేనిస్థితిలో ప్రజాప్రతినిధులుగా ఉన్నామని వాపోయారు. ఈమాత్రందానికి సమావేశాలకు రావడం ఎందుకు ప్రశ్నించడం ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్తున్నాప తప్ప అవి ఎక్కడ జరుగుతున్నాయో అర్థం కావడం లేదని తెలిపారు. అందుకు స్పందించిన సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి సమాధానమిస్తూ బ్రహ్మారావుపేటలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా వీధిలైట్లు సమస్య ఉందని, కోతులను నివారించేందుకు ఉన్నతాధికారులతో చర్చించడం జరిగిందని త్వరలో అన్ని సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామని సమాధానమిచ్చారు. సంగాపురం సర్పంచ్‌భీమనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాల్లో తెలిపిన కొన్ని సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీంతో సమావేశాలకు వెళ్లినా ప్రయోజనం లేదని పలువురు ప్రజాప్రతినిదులు డీలా పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఓట్లు వేసి తమను గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాలన్న కోరిక నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ ఉషామురళి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు ప్రజాప్రతినిదులు ఆరోపిస్తున్నారని అధికారులు ప్రజల సమస్యల పరిష్కారంపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటికీ కొళాయిలు వేయడంతో పాటు రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని కొళాయిల్లో సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పలు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు మందులు ఇచ్చి పశుపోషకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని అటువంటి చర్యలకు పాల్పడిన సిబ్బందిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పశువైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సువర్ణ, ఎంపీడీవో వసంతరావునాయక్, అన్నీ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేపచెట్టు నుంచి పాలు



వేప చెట్టుకు కారుతున్న పాలు

కురిచేడు, జనవరి 13 : మండలం అలవలపాడు గ్రామంలో రెండు రోజుల నుంచి వేపచెట్టుకు పాలు కారుతున్నాయి. ఈ వింతను చూడటానికి గ్రామస్థులు ఎగబడుతున్నారు. వీరిసెట్టి సత్యనారాయణ ఇంటికి సమీపంలో ఉన్న చెట్టు నుంచి శుక్రవారం నుంచి పాలు లాంటి ద్రవం కారుతున్నది. శనివారం ఎక్కువ మొత్తంలో కారింది. ఆ పదార్థం వగరుగా ఉన్నదని రుచి చూ సిన వారు తెలిపారు. ఈ వింతను పెద్ద సంఖ్యలో ప్రజలు చూసి వెళ్తున్నారు.

పొగాకు బ్యారన్‌లో అగ్ని ప్రమాదం

రూ.10లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పామూరు, జనవరి 13 : మండలంలోని రజాసాహెబ్‌పేటలో ప్రమాదశాత్తుగా జరిగిన అగ్ని ప్రమాదంలో పొగాకు బ్యారన్ ఆహుతైంది. యర్రగొర్ల మల్లికార్జునకు చెందిన బ్యార్నీలో పొగాకు లోడింగ్ చేశారు. శనివారం మంటలు అంటుకొని బ్యారన్ తగులబడింది. ఈ ప్రమాదంలో బ్యారన్, పొగాకు బూడిదైంది. సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న కనిగిరి అగ్నిమాపక అధికారి ఆర్ రామకృష్ణ, లీడింగ్ ఫైర్‌మన్ బీ సత్యనారాయణ, ఫైర్‌మన్ సీహెచ్ హుసేనయ్య మంటలను ఆర్పివేశారు.

రేణిమడుగులో 4 ఆలయాల్లో చోరీ



హుండీలను తెరిచిన దొంగలు

పామూరు, జనవరి 13 : శివారు ప్రాం తాల్లో ఉన్న ఆలయాల్లోని హుండీలనే ల క్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని ముఠా చోరీలకు తెగబడుతున్నది. పామూరు ప ట్టణం పరిధిలోని శివారు ప్రాంతంలో ఉన్న విరాట్‌నగర్ ఆలయంలో చోరి జరిగిన సంఘటన మరవక ముందే మండలంలోని రేణిమడుగు గ్రామంలో ఒకే రోజు 4 ఆలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు దోచుకెళ్లిన సంఘటన శనివారం వెలుగుచూసింది. రేణిమడుగులోని శివారు ప్రాంతాల్లో ఉన్న అంజనేయస్వామి, ఎల్లమ్మ, నాగారపమ్మ, అంకమ్మతల్లి ఆలయాల్లో శుక్రవారం రాత్రి దుండగులు ప్రవేశించి తాళాలు పగులకొట్టి భక్తులు కానుకలు సమర్పించే హుం డీను పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. ఈ నాలుగు హుండీలలో సు మారు రూ.లక్ష వరకూ నగదు ఉండవచ్చని గ్రామస్థులు చెప్తున్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో చోరీలు జరిగాయి. హుండీ చోరీలపై గ్రామస్థులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

పీసీపల్లి, జనవరి 13 : అర్హులు కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. లక్ష్మక్కపల్లి, చింతగుంపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ కార్డులను అందజేశారు.





ఊరంతా.. సంక్రాంతి

- నేడు భోగి మంటలకు సిద్ధం
- పట్టణాలు ఖాళీ.. పల్లెలు కళకళ
- అంబరాన్ని అంటేలా సంక్రాంతి సంబరాలు
- రాజధానిలో నేడు భోగి వేడుకలకు చంద్రబాబు, పవన్

గుంటూరు సిటీ, జనవరి 13: సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే శుభ వేళ జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. లోగిళ్ల కొత్త పంటలతో కళకళలాడుతుండగా.. పిండి వంటల సువాసనలు.. హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల సందడి.. గొబ్బెమ్మలతో రంగుల ముగ్గుల అలంకారం.. ఇదంతా సంక్రాంతి వైభవం. చిన్నా.. పెద్ద.. కలిసి చేసుకునే సంబరం. మనసులను.. మనుషులను కలిపే పండుగ వైభోగం. పల్లె ముంగిట్లో మాత్రమే కనిపించే సందడి. ఇలా ఈ పండుగ గురించి ఎన్ని చెప్పినా.. చె ప్పుకు న్నా త క్కు వే.

ఈ ఏడాది సంక్రాంతి మరింత ముస్తాబుగా కనిపిస్తుంది. తెలుగువారి పెద్ద పండుగ కోటి ఆశల పందిరిగా అనిపిస్తుంది. కోడి పందాలు.. మందు.. విందులతో భోగి రోజున అంబరాన్ని అంటే సంబరాలకు పల్లెల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలకు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా శనివారం రాత్రి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంటి దగ్గర పండుగ సందడికి పట్టణాలు, నగర ప్రాంతాల నుంచి కుటుంబాలకు కుటుంబాలు పల్లెకు తరలి వచ్చాయి. దీంతో పలు పట్టణ ప్రాంతాలు వెల వెలపోతుండగా.. పండుగకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడిన వారందరూ పల్లెకు తరలిచ్చారు. వివిధ నగరాలు, ఇతర దేశాల నుంచి ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పల్లె గడప తొక్కడంతో పల్లెల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిస్తున్నాయి. ఇక వారి బంధువులు, తల్లిదండ్రుల్లో అయితే సంతోషం చెప్పనలివి కాకుండా ఉంది. హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో పలువురు ఒకేసారి వాహనాలతో బయలుదేరడంతో అద్దంకి-నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారి వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయింది. తుమ్మల చెరువు, మంగళగిరి సమీపంలోని టోల్ గేట్ల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.

రాజధాని రైతు కళ్లలో కొత్త ఆనందం

ఈ ఏడాది సంక్రాంతి వేళ రాజధాని రైతుల కళ్లలో కొత్త ఆనందం కనిపిస్తోంది. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ నిరంకుశ విధానాలతో గాయపడిన రైతుల గుండెల్లో తాజా రాజకీయ పరిణామాలతో కొత్త సంతోషం కనిపిస్తోంది. భోగి మంటల్లో గత చేదు జ్ఞాపకాలను, ప్రభుత్వ అరాచక జీవోలను తగల బెట్టేందుకు రాజధాని ప్రాంతవాసులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం మారుతుందన్న సర్వేలు, విశ్లేషణలతో గత కొంత కాలంగా రియల్ ఎస్టేట్ రంగానికి ఈ ప్రాంతంలో ఊపు వచ్చింది. ఇది కూడా రాజధానిలో సంక్రాంతి సందడిని ఎక్కువ చేస్తోంది. ఇక భోగి పండుగను మరింత సంబరంగా జరుపుకునేలా రైతులు, గ్రామీణులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామం గోల్డెన్ రూల్ ఆవరణలో జరిగే భోగీ వేడుకలకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఈ పరిణామం రైతు కళ్లలో కొత్త కాంతు లకు కారణమైంది. వేడుకల ఏర్పాట్లను తాడికొండ టీడీపీ ఇన్‌చార్జ్ తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు.







హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల మీదగా పల్లెలకు వెళుతున్న కార్లు

తీరంలో.. కోఢీ

- బరులకు భారీగా ఏర్పాట్లు
- నేటి నుంచి జోరుగా పందాలు
- కోత ముక్కలాటకు ప్రత్యేక టెంట్లు
- రూ.10 వేల నుంచి 2 లక్షల పందాలకు బరులు
- సమీప జిల్లాలు, తెలంగాణ నుంచి తరలిరానున్న జనం



రేపల్లె, భట్టిప్రోలు, చుండూరు, జనవరి 13: సంక్రాంతి వచ్చేసింది.. సంబరాలు అంబరాన్ని అంటేలా వేడుకలు చేసుకునేందుకు పల్లె జనం సిద్ధమయ్యారు. భోగితో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవనుండగా.. కోడి పందాలకు కోళ్లు సై అంటూ కాలు దువ్వేందుకు సిద్ధమయ్యాయి. పందాల సందడికి జూదరులు సిద్ధమవగా.. వాటిని చూడాలని ఉత్సుకతతో పలువురు తరలిరానున్నారు. అధికారులు అడ్డుకుంటున్నా తీర ప్రాంతంలో తగ్గేదేలేదన్నట్లుగా కోడిపందాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతి సంప్రదాయలను అడ్డంపెట్టుకుని కోడిపందాలకు బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. తీర ప్రాంతంలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలో అధికార పార్టీ పెద్దల ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు.



లక్ష నుండి రూ.5 లక్షలు కోడిపందాలు వేసేందుకు సిద్ధం చేస్తున్న బరి

కోడిపందాలతో పాటు పేకాట, లోనబయట, కోతముక్క, గుండాటలకు బరుల వద్ద నిర్వాహకులు ఒక్కొక్కరు నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కోడిపందాల జూదరులతో పాటు వాటిని చూసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి వేలాదిగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలకు విరుద్ధంగా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు బరులను ఏర్పాటు చేస్తున్నారు. రేపల్లె, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశాల్ని రూ.లక్షలకు మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు పాటలు నిర్వహించారు. బిర్యానీ పాయింట్‌కు రూ.5 లక్షలకుపైగానే, శీతల పానీయాలు, గుట్కాలు, ఖైనీలు సిగరెట్లు అమ్మేవారి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారు. కేటగిరీల వారీగా రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల బరులను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి కోడిపందాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఇప్పటికే ప్రకటించారు. కోడిపందాలు వేసేందుకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, తెలంగాణ నుంచి వచ్చిన వారితో రేపల్లెలోని లాడ్జీలు నిండిపోయాయి.

పోలీసుల ఆదేశాలు బేఖాతారు

రెండు రోజులుగా తీరప్రాంతంలో కోడిపందాలను కట్టడి చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో నిర్వాహకులు పోలీసుల సమక్షంలోనే బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద పోలీసులు కాపలా కాసినా ఫలితంలేకుండా పోయింది. రాజకీయా నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు శనివారం వెనుతిరిగి వెళ్లిపోయారని సమాచారం. నిజాంపట్నంలో పది బరులను ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కోడి పందాలకు భూమిని చదును చేశారు. మూడు రోజుల పాటు పందాలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించారు. బరుల ఏర్పాటుకు తీసుకు వచ్చిన సామగ్రిని పోలీసులు పంపించి బందోబస్తు ఉన్నారు. చుండూరులో నాలుగు రోజుల క్రితం అధికార పార్టీ పెద్దలతో నియోజకవర్గ నాయకుడు జరిపిన సంప్రదింపులు సఫలం అయ్యాయి. దీంతో స్థానిక నాయకులు చుండూరు, వేటపాలెం మధ్య పొలాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది రూ.కోటికిపైగా ఆదాయం రావడంతో ఈ ఏడాది కూడా నిర్వాహకులు కోడిపందాలకు పోటీపడుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా అదే స్థలంలో పందాల కోసం రెండు ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోల్స్ వేసి బరులకు సిద్ధం చేశారు. ఆయా ఏర్పాట్లు వెనుక వైసీపీ పెద్దలు ఉండటంతో స్థానిక పోలీసులు వారిని అడ్డుకోలేకపోతున్నారని సమాచారం.

కొల్లూరు : కోడి పందాల బరి ఏర్పాట్లను అడ్డుకున్న తహసీల్దార్, ఎస్ఐలు



ఏర్పాట్లను అడ్డుకున్న అధికారులు

కొల్లూరు: మండలంలోని పెసర్లంక పొలాల్లో బరి కోసం జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఎస్ఐ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావులు అడ్డుకున్నారు. సంప్రదాయబద్ధంగా కోడి పందాలు వేసుకుంటామని, పైగా తమ పొలంలో బరి ఏర్పాటు చేసుకుంటే ఏమైందని నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. కోడి పందాలకు ఎటువంటి అనుమతులు లేవని నిర్వాహకులకు ఎస్ఐ, తహసీల్దార్ తేల్చిచెప్పారు.



నిజాంపట్నంలో కోడిపందాలు నిర్వహించేందుకు బరులను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

జగన్‌కు.. ఝలక్

- మొన్న రాయుడు.. నేడు బాలశౌరి
- ఇప్పటికే దూరమైన శ్రీకృష్ణదేవరాయులు ?
- ఎంపీలకు సీఎం రేవంత్ విందు తెచ్చిన తంటా
- కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో లావు, బాలశౌరిలకు పొగ



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తన సంకుచిత మనస్తత్వంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు చేజేతులా పార్టీ వీడే పరిస్థితి తెచ్చుకున్నారు. మరొక ఔత్సాహిక ఎంపీ కూడా ఇప్పటికే పార్టీని వీడారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన మచిలీపట్నం ఆఫర్ అందుకున్న రాయుడే కాకుండా, తనను ఉట్టి పుణ్యానికే పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని భావించిన సిట్టింగ్ ఎంపీ బాలశౌరి కూడా వైసీపీకి రాజీనామా చేసి జగన్‌కు ఝలక్ ఇచ్చారు. ఇక ఇప్పటికే జగన్ నిర్ణయంపై మండిపడుతూ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వైసీపీకి అనధికారికంగా దూరమయ్యారు. దీనికంతటికీ జగన్‌కు తెలియకుండా తెలంగాణ సీఎం పీఠాన్ని దక్కించుకున్న ఎంపీ రేవంత్‌రెడ్డి ఆ పదవిని వీడి వస్తూ ఢిల్లీలో ఇటీవల అన్ని పార్టీల ఎంపీలకు విందు కారణమని సమాచారం. రేవంత్ విందుకు వైసీపీ ఎంపీలు 20 మంది వరకు వెళ్లారు. వైసీపీ ఎంపీలను ఆ విందుకు తీసుకెళ్లడంలో కృష్ణదేవరాయులు కీలక పాత్ర పోషించారు. తోటి ఎంపీ సీఎంగా ఇస్తున్న వీడ్కోలు విందుకు వెళ్లడం తప్పేమిటని మిగతా వైసీపీ ఎంపీలను ఒప్పించి తీసుకెళ్లారు. కృష్ణదేవరాయులతో సన్నిహితంగా ఉండే ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా ఈ విందు వ్యవహారంలో కో కెప్టెన్‌గా వ్యవహరించారు. రేవంత్‌రెడ్డి విందుకు వైసీపీ ఎంపీలు వెళ్లడంలో కృష్ణదేవరాయులు, బాలశౌరిలు కీలకపాత్ర వహించారనే కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో వారు కోరుకున్న స్థానాల నుంచి పోటీ చేసే అవకాశం కల్పించకుండా జగన్ పొగపెట్టి దూరం చేసుకున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకి చెందిన బాలశౌరికి గత ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. స్థానికేతరుడైనప్పటికీ ఆ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేసి తిరిగి మచిలీపట్నం నుంచే పోటీ చేయాలనే కోరికతో బాలశౌరి ఉన్నారు. ఈ క్రమంలో గుంటూరుపై ఆశతో ఉన్న క్రికెటర్ అంబటి రాయుడికి మచిలీపట్నం నుంచి పోటీ చేస్తేనే సీటు ఇస్తానని జగన్ ఆఫర్ ఇచ్చారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న తనను కాదని రాయుడిని పోటీ చేయమనటంతో బాలశౌరికి మండింది. అదేమిటని జగన్‌ను ప్రశ్నించగా 'సర్వేలో అక్కడ నుంచి తిరిగి నీకు గెలిచే అవకాశాలు లేవు... ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం అదే పార్లమెంటు పరిధిలో కల్పిస్తాను..' అంటూ బాలశౌరికి జగన్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ ఆఫర్ వింతగా ఉండటంతో తనను పొమ్మనకుండా పొగబెడుతున్నారని భావించిన బాలశౌరి వైసీపీకి రాజీనామా చేయటం ద్వారా గుంటూరు మిర్చి ఘాటు చూపించారు. జనసేన, టీడీపీ కూటమి ద్వారా ఆయన అదే నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

గుంటూరుకు బదిలీపై లావు గుడ్‌బై?

గుంటూరుకు చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు గత ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో తొలుత లావుకు గుంటూరు ఎంపీ సీటునే ఇస్తానని జగన్ చెప్పడంతో 2019 ఎన్నికల సమయంలో ఏడాదికి ముందే విజయం కోసం వ్యూహ రచన చేసుకున్నారు. అయితే ఎన్నికలు సమీపించే సమయానికి ఈ సీటును మోదుగుల వేణుగోపాల్‌రెడ్డికి ఇచ్చేందుకు కృష్ణదేవరాయులును ఉన్న పళంగా నరసరావుపేటకు పంపారు. ఇక్కడ పడిన శ్రమంతా వృథా అవుతుందని గుంటూరు సీటు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అయిష్టంగానే నరసరావుపేట నుంచి పోటీ చేసేందుకు కృష్ణదేవరాయులు అంగీకరించారు. సుమారు లక్షన్నర ఓట్ల ఆధిక్యతతో లావు విజయం సాధించారు. అయితే వచ్చే ఎన్నికల్లో నరసరావుపేటపై ఆసక్తితో ఉండగా తిరిగి గుంటూరులో పోటీ చేయని జగన్ లావును ఆదేశించారు. దీంతో జగన్ జిగ్‌జాగ్ ఆడుతున్నాడని కృష్ణదేవరాయులు అధికారికంగా రాజీనామా చేసి జగన్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. మానసికంగా కృష్ణదేవరాయులు వైసీపీని వీడినప్పటికీ మంచి ముహూర్తం చూసుకుని రాజీనామా చేసి టీడీపీలో చేరడం ఖాయమని సమాచారం.

సొసైటీల్లో.. కమిటీల పాలనే

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- దొడ్డిదారిన కమిటీలతో పాలన కొనసాగింపు
- ఇక వైసీపీ హయాంలో సహకార ఎన్నికలు లేనట్లే
- ఐదేళ్లగా ఎన్నికలకు సాహసం చేయని ప్రభుత్వం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పని చేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా.. సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలే ప్రభుత్వం నిర్ణయం తీసుకుం టోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రి సభ్య కమిటీల ఆధ్వర్యం లోనే సహకార సంఘాల కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సాహసం చేయడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశ పెట్టింది. దీనిని కొనసాగించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపింది. మరో ఆరు నెలలు ఆయా కమిటీల పాలనను కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేసింది. పార్టీ నేతలకు పదవులు ఇచ్చుకునేందుకే ఎన్నికలను నిర్వహించ డంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అయినా వాటిని లెక్క చేయకుండా ప్రత్యేక కమిటీలనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నాయి. త్రిసభ్య కమిటీల పదవి కాలం ముగిసింది. దీంతో 18 నుంచి జూలై 17 వరకు ఆ కమిటీల పదవీ కాలం పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాలు పని చేయాల్సి ఉండగా మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటున్నది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

2013లో సహకార ఎన్నికలు

సహకార సంఘాలకు చివరగా 2013లో జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటి న ుంచి ఎన్నికలు జరగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు ఉంటాయని అందరూ ఎదురుచూశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇలా రెండు సార్లు ప్రకటనలు చేసినా ఎన్నికలను నిర్వహించేందుకు వైసీపీ ప్రభుత్వం సాహసం చేయలేదు. పైగా త్రి సభ్య కమిటీల పాలనను సొసైటీల్లో ప్రవేశపెట్టింది.

ఇష్టారాజ్యంగా త్రిసభ్య కమిటీలు

జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు అక్రమాలకు తెరతీశాయని ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్న విమర్శలున్నాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని ఆయా కమిటీలు నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. మార్చి 2019 కన్నా ముందుగా సొసైటీలలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2020 డిసెంబరులో ప్రభుత్వం మరో సారి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను కొన్ని త్రి సభ్య కమిటీలు నియమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా నియామకాలకు లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం ఉంది. ఆయా నియామకాలపై విచారణ జరిగితే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.



సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్(ఫైల్)

స్పీడు పెంచిన గొట్టిపాటి.. పట్టుకోసం హనిమిరెడ్డి

- వైసీపీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి, జనవరి 13: నియోజకవర్గంలో సైకిల్ స్పీడు పెరిగింది. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తరచూ గ్రామాలలో పర్యటిస్తున్నారు. నియోజకవర్గంలో సైకిల్ యాత్ర ద్వారా 62 పంచాయతీలలో పర్యటించారు. 20 గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత పక్షం రోజులుగా జొన్నతాళి, అద్దరోడ్డులో గ్రామాల వారీ నేతలు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యర్థులకు అందనంత స్పీడుతో గొట్టిపాటి ముందుకు సాగుతున్నారు. ఇక అధికార వైసీపీ విషయానికి వస్తే కొత్తగా నియమితులైన ఆపార్టీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి నియోజకవర్గంలో పట్టుకోసం పాకులాడుతున్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించి నెలరోజులు గడిచినా ఇంకా పలువురు మండల కన్వీనర్‌లు సైతం హనిమిరెడ్డికి దూరంగానే ఉన్నారు. కొరిశపాడు, పంగులూరు, బల్లికురవ మండలాల కన్వీనర్లు రావి శ్రీధర్, యర్రం శ్రీనివాస రెడ్డి, చింతల పేరయ్య, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, సాధినేని మస్తానరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య వర్గంలోనే కొనసాగుతున్నారు. కృష్ణచైతన్య మండలాలవారీ నేతలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ భవిష్యత్ ప్రణాళికపై చర్చిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో అధిష్టానం మనసు మార్చుకొని అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా తనకే సీటు ఇస్తుందని ఆయన చెబుతున్నారు. ఇలా అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలు రెండు వర్గాలుగా చీలిపోయారు. గొట్టిపాటి రవికుమార్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండటం, అటు క్షేత్రస్థాయిలో వైసీపీ నేతలతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉండటంతో టీడీపీకి కలిసి వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

కళాకారులకు ప్రేక్షకుల చప్పట్లే అవార్డులు

» అనంతవరంలో ఆకట్టుకుంటున్న నాటిక ప్రదర్శనలు


నిశబ్ధమా నీ ఖరీదెంత నాటికలోని ఓ సన్నివేశం

యద్దనపూడి (మార్టూరు), జనవరి 13: కళాకారులకు ప్రేక్షకుల చప్పట్లు ఆస్కార్ అవార్డులు లాంటివని బొప్పూడి శాంతినికేతన్ కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి ఆరెకట్ల ప్రసాద్ అన్నారు. యద్దనపూడి మండలం అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు మూడవ రోజు శనివారం రాత్రి జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆరెకట్ల ప్రసాద్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం సభా వేదికపైకి కందిమళ్ల సాంబశివరావు అతిథులను ఆహ్వానించగా, కెనరా బ్యాంకు ఏజీఎం పెడవల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమం అనంతరం విశ్రాంత మెట్రో ప్రాజెక్టు డైరెక్టర్ (ముంబయి) పాపరాజు రాధాకృష్ణను కళాపరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షులు గుదే పాండు రంగారావు, గుదే తారకరామారావు, కొరటాల వంశీ, నిమ్మల సాంబశివరావు, పెడవల్లి కల్యాణచక్రవర్తి, పెడవల్లి వెంకటేశ్వర్లు, పోపూరి హనుమంతరావు, పోపూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో కనిపించే ఇతి వృత్తాలుగా ప్రదర్శనలు

శనివారం రాత్రి మూడు నాటికల ప్రదర్శనలు జరిగాయి. మొదటగా తెలుగు కళా సమితి విశాఖపట్టణం వారు ప్రదర్శించిన నిశబ్ధమా నీ ఖరీదెంత నాటికలో కొంతమంది మహిళలు చట్టాన్ని దుర్వినియోగంపరుస్తూ పచ్చని కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటున్న వైనాన్ని కథా రచయిత పదునైన సంభాషణలతో ప్రేక్షకులను ఆలోచింపచేశారు. మేధావులు నిశబ్ధంగా ఉండటం జాతికే ప్రమాదం అంటూ సందేశాత్మకంగా నాటిక ముగుస్తుంది. ఉషోదయ కళానికేతన్ వారు కత్రపాడు నాటికను ప్రదర్శించారు. టెక్నాలజీ మోజులో పడిపోయి నైతిక విలువలను గాలికి వదిలేసి అమ్మాయిల జీవితాలతో ఆడుకునే కొంతమంది యువకులను సమాజం నుంచి వెలివేసి ప్రక్షాళన చేయాలంటూ కళాకారులు చేసిన ప్రదర్శన ఆలోంపచేసింది. ఈవిషయమై యువత తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలని కథా రచయిత వారి బాధ్యతను గుర్తు చేశారు. చివరగా సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారు ప్రదర్శించిన మిణుగురు వెలుగులు నాటిక భార్యాభర్తల మధ్య ఉండవలసిన, ప్రేమ, నమ్మకం, గురించి చాలా చక్కగా వివరించారు. ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలియకుండా కొంతమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారిని హెచ్చరిస్తూ, వారి ఆలోచనా విధానంలో మార్పురావాలని ఆకాంక్షిస్తూ నాటికను ప్రదర్శించారు.

ఆదివారం రాత్రి న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్ విజయవాడ వారిచే కపిరాజు నాటిక, రసర్జురి పొన్నూరు వారిచే కాపలా నాటిక, శ్రీకారం రోటరీ కళా పరిషత్ వారిచే రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు.

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

చినగంజాం, జనవరి 13: స్థానిక భూసమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించే సారెను గ్రామ పురవీధులలో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలోని అమ్మవారికి విశేష పూజలు జరిపి తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ఇంకొల్లు, జనవరి 13: జాతీయ ఉపాధి హామీ నిధులతో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పనులు చేపట్టాలని పీడీ అర్జున్ అధికారులకు సూచించారు. ఇంకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022-23 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రూ.12.69 కోట్ల ఉపాధి పనులపై తనిఖీలు చేశారు. వంకాయలపాడులో ఒక పనికి బదులు మరో పని చేసినదానికి సంబంధించి రూ.లక్షా 35 వేలు వెంటనే రికవరీ చేయాలని ఏపీవో రేణుకను ఆదేశించారు. నాగండ్ల, నక్కలపాలెం ఫీల్డ్అసిస్టెంట్‌లు పనుల పట్ల అలసత్వంగా వ్యవహరించినట్లు గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీపీ బండారు అనూష, డీవీవో శోభన్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, రాజారావు, ఆవులయ్య, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మా క్లయింటు శ్రీమతి ముప్పల వెంకట రాజ్యలక్ష్మి, W/o.శాంతయ్య, R/o.కారంచేడు గ్రామం మరియు మండలం గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది యేమనగా :

ఈ దిగువ చూపిన షెడ్యూల్ దాఖల స్థిరాస్తులు, మా క్లయింటు మరియు ఆమె సోదరులు అయిన 1) పొట్టి జనార్ధనరావు మరియు 2) వెంకట శ్రీనివాసరావు లకు చెందిన ఉమ్మడి ఆస్తులు మరియు వారికి వారి పూర్వీకుల నుండి వారసత్వరీత్యా సంక్రమిచ్చి వారి ఉమ్మడి స్వాధీన అనుభవంలో ఉన్నవని తెలియజేయుచున్నారు. సదరు ఆస్తులపై భాగపంపిణి పరిహార నిమిత్తము మా క్లయింట్ శ్రీమతి ముప్పల వెంకట రాజ్యలక్ష్మి గారు, చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.304/2017 నంబరు దావాను దాఖలు చేయగా సదరు దావా విచారణలో ఉన్నది. శ్రీ కోర్టు వారు పై దావా నందు, I.A.1841/2017 పిటీషన్‌లో ఈ దిగువ చూపిన షెడ్యూల్ ఆస్తులపై క్రయ,విక్రయములను నిషేధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసి ఉన్నారు.

మా క్లయింటుకు, ప్రత్యర్థి అయిన పొట్టి వెంకట శ్రీనివాసరావు, దిగువ తెలిపిన ఆస్తులపై ఉన్న వివాదములు, కోర్టులో ఉన్న దావాను మరియు కోర్టు వారి ఉత్తరువులను మరుగుపెట్టి మోసపూరితంగా దిగువ చూపిన ఆస్తులుకు తను పూర్తి హక్కుదారునని చెప్పుచూ, వాటిని అమ్ము ప్రయత్నములో ఉన్నట్లు మా క్లయింటుకు తెలియవచ్చినది.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తులపై పొట్టి వెంకట శ్రీనివాసరావు పూర్తి హక్కుదారు కాదని, వారు జరుపు అమ్మకాలు మరియు ఇతర లావాదేవీలు, చట్టపరంగా చెల్లవు అని, మరియు కోర్ట్ వారి ఉత్తర్వులుకు వ్యతిరేకంగా కొనుగోలు చేసిన వారు, మా క్లయింట్ చట్టపరంగా తీసుకొనబోవు యావత్తు క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు భాద్యులు కాగలరు అని ఇందుమూలముగా తెలియజేయుటమైనది.

షెడ్యూల్

Item No.1. Prakasam Dist.-Chirala S.R.O. - Chinnaganjam Mandal - Kadavakuduru Village - Survey No.534/1A an extent of Ac.1.58 cents, Survey No. 534/1B an extent of Ac.0.57 cents, total extent Ac.2.15 Single plot as bounded by: **East** : Potti Bhaskar, Potti Sankar, **South** : Chittineni Rama Krishna, **West:** R&B Road, **North** : Kotika Srinivasa Rao. etc.

Item No.2. Prakasam Dist.- Chirala S.R.O. - Chinnaganjam Mandal - Kadavakuduru Village - Survey No.540/5A & 5B an extent of Ac.1.30 cents, as bounded by; **East** : Panta Kalva, **South** : Adusumalli Pedadurgaiah, **West:** Romperu Kalva, **North** : Nagireddy Purna.

Item No.3. Prakasam Dist.-Chirala S.R.O. - Chinnaganjam Mandal - Kadavakuduru Village - Survey No.274/1 an extent of Ac.0.50 1/2 cents, as bounded by; **East** : Donka Road, **South** : Kovatla Venkatappaiah etc, **West:** Raju Bangarupalem Kalva, **North** : Indurthi Seetharavamma.

Item No.4. Prakasam Dist.-Chirala S.R.O. - Chinnaganjam Mandal - Kadavakuduru Village - Gramapanchayat - Door No.3/70 - Survey No.370/4 - R.C.C residential house - Two storied - total extent of 70 square yards as bounded by; **East** : Potti Subbarao, **South** : Potti Rama Brahamam, **West:** R&B Road, **North** : Potti Srinivasarao.

Item No.5. Prakasam Dist.-Chirala S.R.O. - Chinnaganjam Mandal - Kadavakuduru Village - Survey No.364/9 - Door No.3-10 - house site - an extent of 193.6 Sq.yards cents as bounded by: **East** : Road, **South** : Potti Sreedhararao, **West:** Potti Nagendrarao, **North** :- Potti Lakshmanarao

చీరాల.
ది. 13-01-2024

ఇట్లు :
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
అడ్వకేట్, చీరాల

కోడి పందేలకు రెడీ

» గతంలోనూ పలుచోట్ల నిర్వహణ

అద్దంకి, జనవరి 13: సంక్రాంతికి కోడి పందాలు నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. గతంలోనూ పలుచోట్ల కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు. ప్రధానంగా జిల్లా, మండల సరిహద్దు ప్రదేశాలలో కోడి పందాల వేస్తుంటారు. ఈక్రమంలో అటు ప్రకాశం, ఇటు పల్నాడు జిల్లాల సరిహద్దులో కోడి పందాలు జరిగే అవకాశం ఉంది. అద్దంకి నియోజకవర్గంలో అత్యధిక శాతం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. సంతమాగులూరు మండలం లో పలుగ్రామాలు పల్నాడు జిల్లా సరిహద్దులో ఉండటంతో రెండు జిల్లాలకు చెందిన పందెంరాయుళ్లు కొన్నిప్రదేశాలను ఎంపికచేసుకొని సెల్‌ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చుకొని అక్కడికి చేరుకొని కొద్ది గంటల వ్యవధిలోనే పందాలు ముగించుకొని వెళ్తుంటారు.

ఇక ప్రకాశం జిల్లా సరిహద్దులో అద్దంకి సర్కిల్ పరిధిలో ధేనువకొండ, రామాయ పాలెం తదితర ప్రాంతాలలో కోడి పందాల నిర్వహణకు అవకాశం ఉంది. గత ఏడాది అద్దంకి మండలం కొటికలపూడి, కుంకుపాడు మధ్య పొలాల్లో భారీస్థాయిలో కోడిపందాలు వేస్తుండగా పోలీసులు మారు వేషాలలో వెళ్ళి పట్టుకున్నారు. పలు సందర్భాలలో కొత్తరెడ్డిపాలెం, ధర్మవరం, శంఖవరప్పాడు, కొటికలపూడి, ధేనువకొండ, రామాయపాలెంలో కూడా జరిగాయి. పంగులూరు, కొరిశపాడు మండలాల సరిహద్దులో కూడా పెద్ద ఎత్తున కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు. బల్లికురవ మండలం లో కూడా గతంలో పలుసార్లు కోడి పందాలపై పోలీసులు దాడులు చేశారు.

ఇలా ప్రతిఏటా ఏదో ఒక ప్రాంతంలో కోడి పందాలు జరుగుతూనే ఉన్నాయి. కోడి పందాలు జరిగే ప్రదేశానికి వచ్చే మార్గాలలో దూరంగా కాపలాగా మనుషులను ఏర్పాటుచేసి కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇచ్చేవిధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో పోలీసులు సాధారణ వ్యక్తులుగా వెళ్తే మినహా పట్టుబడటం కష్టంగా మారింది. కోడి పందాలు జరిగే ప్రదేశాలను అప్పటికప్పుడు ఫిక్స్ చేసుకుంటుం డటంతో పోలీసు అధికారులకు సమాచారం వచ్చి అక్కడకు వెళ్ళేసరికే కోడి పందాలు పూర్తి చేసుకొని వెళ్ళిపోతున్నారు. దీనికితోడు మండలాల సరిహద్దు ప్రాంతాలను ఎంపిక చేసుకుంటుండటంతో ఎవరి పరిధి అని తెలుసుకొని వెళ్ళేలోపే పుణ్యకాలం పూర్తి అవుతుంది. ఈనేపథ్యంలో పోలీసు అధికారులు మరింత నిఘా పెట్టితే మినహా కోడి పందాలను అరికట్టడం సాధ్యం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు వైసీపీని సాగనంపాలి

» నవరత్నాల పేరుతో దగాచేసిన సీఎం
» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


తిమ్మాయపాలెం నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి/బల్లికురవ, జనవరి 13: నవరత్నాల పేరుతో సీఎం జగన్మోహనరెడ్డి నవ మోసాలకు పాల్పడుతున్నారని, అందరి భవిష్యత్ కోసం వైసీపీని వచ్చే ఎన్నికలలో ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలతో మార్టూరు మండలం జొన్నతాళి వద్ద ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం వేర్వేరుగా సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ, ఓటర్ల జాబితా పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటికి వెళ్ళి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలని నేతలకు ఎమ్మెల్యే రవికుమార్ సూచించారు.

ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదని, నిత్యావసర ధరలు మాత్రం బాగా పెరిగాయన్నారు. పెరిగిన గ్యాస్ ధరలతో కట్టెల పొయ్యిలపై వంట చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. అన్నా క్యాంటీన్‌లు తెరిపించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలుచేసిన 130 కి పైగా సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. టీడీపీని ఆదరిస్తుంది బీసీ లేనని చెప్పారు. బీసీలలో నాయకత్వాన్ని పెంపొందించింది కూడా టీడీపీయేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్‌లు తగ్గించి 16,800 పదవులకు బీసీలను దూరం చేసిందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో పేదలు మరింత పేదలుగా మారారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం జగన్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. రంగుల పిచ్చితో టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు పంచకుండా రోడ్డున పడేశారన్నారు. సర్వే రాళ్ళు, పట్టాదారు పాసుపుస్తకాలపై కూడా జగన్ తన బొమ్మలను వేసుకోవటం ఏమిటన్నారు. అందరి భవిష్యత్ కోసం వైసీపీని ఇంటికి సాగనంపి, రాష్ట్రానికి టీడీపీ, జనసేన పార్టీల స్వర్ణయుగం తీసుకువద్దామని నేతలు, కార్యకర్తలకు సూచించారు.

సమావేశాలలో టీడీపీ నేతలు కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, తిమ్మాయపాలెం నేతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, పరిటాల పవన్‌కుమార్, పరిటాల శ్రీనివాసరావు, సిద్ధయ్య, అల్లంనేని కాశయ్య, బల్లికురవ మండల నేతలు పావులూరు సత్యనారాయణ, ఏడుకొండలు, సర్పంచ్ పందిరి అంజిబాబు, గొట్టిపాటి ఏడుకొండలు, బెల్లంకొండ సుబ్బారావు, బైరపునేని అజయ్, నాగబోయిన సింగారావు, తన్నీరు వీరాంజనేయులు, తిరుపతిరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వివరాలు

అద్దంకి, జనవరి 13: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10.15 గంటలకు తక్కెళ్ళపాడు, 1045కు అద్దంకిలోని 2వ వార్డు, సాయంత్రం 4 గంటలకు కొండమంజులూరులలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

శింగరకొండలో వెంకటేష్ ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న వెంకటేష్ దంపతులు

అద్దంకి, జనవరి 13: వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ దంపతులు శనివారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడునెలల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేష్ హైదరాబాద్‌లో ఉన్నారు. సంక్రాంతికి కుటుంబసభ్యులతో కలసి ఒంగోలు వస్తూ శనివారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పూజారులు ఆశీర్వదించారు.

బెదిరింపులకు భయపడం.. సమ్మెను విరమించం

» 33వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
» ప్రభుత్వ తీరుపై కార్యకర్తల ధ్వజం


మార్టూరులో నోటీసులను భోగి మంటల్లో వేసి దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

బల్లికురవ, జనవరి 13: తమ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు గురిచేసినా సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. శనివారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలు తామంతా సమిష్టిగా ఉన్నామని చేయి చేయి కలిపి నిరసన వ్యక్తం చేశారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్న ఇంతవరకు ముఖ్యమంత్రి నుంచి తమకు సరైన హమీ రాలేదని, మంత్రుల బృందాలు రోజుకో రకంగా నాటకాలు ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సరస్వతి, సునంద, సత్యవతి, రాజకుమారి పాల్గొన్నారు.

భోగి మంటల్లో నోటీసులు దహనం

మార్టూరు, జనవరి 13: అధికారులు జారీ చేసిన నోటీసులను శనివారం భోగి మంటల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు దహనం చేశారు. మండల కార్యాలయాల వద్ద సమ్మెలో భాగంగా భోగి మంటలు, ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేశారు. యద్దనపూడి మండలంలో కూడా అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు.

అద్దంకిటౌన్: ప్రభుత్వం మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టి నిరవధిక సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని గంగయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, జి.శారద, మనోలత పాల్గొన్నారు.

వేతనాలు పెంచేవరకు ఉద్యమిస్తాం

చినగంజాం, జనవరి 13: అంగన్‌వాడీల సమస్యలు తీర్చేవరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెలో శనివారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుందని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలు, ఆయాలు పూలు కడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఇంకొల్లు: అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకొని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు డిమాండు చేశారు. గత 33 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు పండుగ రోజుల్లో రోడ్ల వెంబడి నిరసనల్లో పాల్గొంటున్నా పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి, వెంకటరమణ, సుజాత, దేవమ్మ, రేవతి, సుబ్బాయమ్మ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన చెన్నై జట్లు

మేదరమెట్ల, జనవరి 13: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో శ్రీ భమర సంక్రాంతి కప్ 2024 క్రికెట్ పోటీలు ఆటగాళ్ళ ప్రతిభను కనబరుస్తున్నారు. శనివారం ఉదయం, సాయంత్రం జరిగిన పోటీలలో శ్రీసీసీ చెన్నై జట్టు, జీఎస్‌టీ సెంట్రల్ ఎ క్సైజ్ చెన్నై జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగిన పోటీలలో వైట్ ఫీల్డ్ క్రికెట్ అకాడమి బెంగుళూరు, శ్రీసీసీ చెన్నై జట్ల మధ్య పోటీ జరిగింది. శ్రీసీసీ చెన్నై జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ దిగిన వైట్ ఫీల్డ్ క్రికెట్ అకాడమి 19.1 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీసీసీ చెన్నై జట్టు 13. 4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసి లక్ష్యాన్ని సాధించింది. ఈ జట్టులోని తరుణ్ 25 బంతులలో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51 పరుగులు చేశాడు.

సాయంత్రం ఆర్బీసీసీ లెవెన్ హైదరాబాద్, జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన జీఎస్టీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లతో 7 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జీఎస్టీ చెన్నై జట్టు 15.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. ఈ జట్టులోని సుధాన్ 37 బంతులలో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51 పరుగులు చేశాడు.

ఆదివారం ఉదయం సీసీ చెన్నై, తండర్‌బోల్ట్స్ తిరుపతి జట్ల మధ్య పోటీ జరగనుంది. సాయంత్రం ప్రసాద్ జెడ్ స్పోర్ట్స్ లెవెన్ హైదరాబాద్, జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్ల మధ్య పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.


మేదరమెట్ల: ఆర్బీసీసీ హైదరాబాద్, జీఎస్టీ చెన్నై జట్ల మధ్య జరుగు తున్న మ్యాచ్

రసవత్తరంగా సాగుతున్న క్రికెట్ పోటీలు


పంగులూరు: కొండమంజులూరులో జరుగుతున్న పోటీలలో తలపడుతున్న చెన్నై, విజయవాడ జట్లు

పంగులూరు, జనవరి 13: మండలంలోని కొండమంజులూరులో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన పోటీలలో విజయవాడపై చెన్నై, తిరువళ్ళూరుపై సిక్కోలు చేతాస్ శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగి న మ్యాచ్‌లో తిరువళ్ళూరుపై టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు ముం దుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌట్ అయింది. 184 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టి న తిరువళ్ళూరు జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 148 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయింది. శ్రీకాకుళం జట్టులోని కిన్లే నాలుగు వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో ఎంఆర్‌సీసీ చెన్నై, విజయవాడపై 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన చెన్నై జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. 160 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన విజయవాడ జట్టు 130 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చవిచూసింది. చెన్నై క్రీడాకారుడు సెల్వకుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ఆదివారం ఉదయం కేరళ, శ్రీకాకుళం జట్లు, సాయంత్రం ఎంఆర్‌సీసీ చెన్నై, లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.

పేదలకు సంక్రాంతి కిట్‌లు పంపిణీ


ఎన్టీఆర్ నగర్‌లో సంక్రాంతి కానుక కిట్‌లు పంపిణీ చేస్తున్న తెలుగుయువత నేతలు

అద్దంకి, జనవరి 13: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో తెలుగుయువత ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. తెలుగుయువత నాయకుడు కోనేటి అనిల్ సహకారంతో శనివారం రాత్రి సుమారు 200 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.550 విలువైన ఐదు కిలోల బియ్యం, అర కిలో కందిపప్పు, పంచదార, కూరగాయలు తదితర వస్తువులతో సంక్రాంతి కానుకలను అందజేశారు. కార్యక్రమంలో అల్లం అంజయ్య, వెంకన్న, కొండయ్య, సాయి, వెంకటరావు, దుర్గ, చిట్యాల హనుమ పాల్గొన్నారు.

గౌడ సాధికార సంఘం అధ్యక్షుడిగా సురేంద్రగౌడ్

పంగులూరు, జనవరి 13: తెలుగుదేశం పార్టీ గౌడ సాధికార సంఘం అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడిగా ముప్పవరం గ్రామానికి చెందిన ఏమినేని సురేంద్రగౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర బీసీ సాధికార సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాశ్ నారాయణ ద్వారా నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సామాజికవర్గ సంక్షేమానికి రాష్ట్ర గౌడ సాధికార సంఘం కన్వీనర్ దాసరి హనుమంతరావుతో కలసి కృషి చేస్తానని సురేంద్రగౌడ్ పేర్కొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు అందజేత

అద్దంకి, జనవరి 13: అద్దంకి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏడు జట్లు పాల్గొనగా బాపట్ల, అద్దంకి, గొర్రెపాడు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. విజేతలకు అర్జునరావు, శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, నరసింహారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గద్దల చంటిబాబు, కిరణ్‌కుమార్, రమేష్, నరసింహారావు, జయరాజు, ఏడుకొండలు, రవికుమార్, ఆంజనేయులు, అల్లాభక్ష్ పాల్గొన్నారు.

రూరల్ సీఐగా నిమ్మగడ్డ బాధ్యతల స్వీకరణ


సత్యనారాయణ

చీరాలటౌన్, జనవరి 13: చీరాల రూరల్ సీఐగా నిమ్మగడ్డ సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిజాంపట్నం మెరైన్ నుంచి చీరాలకు బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది, పలువురు ప్రముఖులు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నిమ్మగడ్డ మాట్లాడుతూ గతంలో చీరాల పరిధిలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు.

రేపు కడవకుదురులో మన ఊరు-మన ఆట

చినగంజాం, జనవరి 13: మండలంలోని కడవకుదురు గ్రామంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం మండల స్థాయి ముగ్గులు, పిండి వంటల పోటీలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు తెలిపారు. కడవకుదురులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన జనసేన నాయకులతో కలిసి మన ఊరు-మన ఆట కరపత్రాలను ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 6281243052, 9963282107, 8374326526 నెంబర్లను సంప్రదించాలని తోట అశోక్‌చక్రవర్తి, అడుసుమల్లి హరిబాబులు కోరారు.

మహబుల్లా మృతిపై ఏలూరి సంతాపం

ఇంకొల్లు, జనవరి 13: ఇంకొల్లుకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు షేక్ మహబుల్లా మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఏలూరి పేర్కొన్నారు.

శింగరకొండలో న్యాయాధికారి ప్రత్యేక పూజలు

అద్దంకి, జనవరి 13: కడప జిల్లా ప్రొద్దుటూరు అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి హారిక దంపతులు, కుటుంబసభ్యులు శనివారం ఉదయం శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారిక దంపతులను పూజారులు ఆశీర్వదించారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానం చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, సెక్రటరీ నూకల రామాంజనేయులు, కోశాధికారి కోటేశ్వరరావులు హారిక దంపతులను సత్కరించారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరు అరెస్ట్

చినగంజాం, జనవరి 13: మండలంలోని పెదగంజాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.సురేష్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ తన షాపులో మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మహిళపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కడవకుదురు గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. నాలుగు ద్విచక్రవాహనాలు, రూ1,120 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూనూరులో అక్షతలు ఊరే గింపు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 13: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలు, పత్రాలతో శనివారం మండలంలోని పూనూరు గ్రామంలో నగర సంకీర్తన చేశారు. గ్రామంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానానికి అక్షింతలు, పత్రాలను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించిన తర్వాత గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

పర్చూరు, జనవరి 13: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక వైజంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణంలో మెగా సౌత్ ఇండియా లెవెల్ క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తులసి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

అద్దంకిటౌన్, జనవరి 13: పట్టణంలోని గీతామందిర్‌లో వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉటుకూరి ఉమాఅన్నపూర్ణ, నాగరాజకుమారి, అయితారాజా, ఆంజనేయులు, ఆదినారాయణ, విజయలక్ష్మి, శిరీష, పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా: హనిమిరెడ్డి

పంగులూరు, జనవరి 13: ప్రతి పేదవానికి అండగా ఉంటానని వైసీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. మండలంలోని ముప్పవరంలో వివిధ గ్రామా ల పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ తాను ప్రతి కుటుంబంలో ఓ సభ్యునిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికలలో తన గెలుపునకు అందరూ సహకరించాని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ భద్రారెడ్డి, పరిశీలకులు మారం వెంకారెడ్డి, బీవీ కోటిరెడ్డి, పులికం కోటిరెడ్డి, ఎంపీపీ తేళ్ళ నాగమ్మ, జంపాని రవిబాబు, స్వయంపు హనుమంతరావు, భాస్కరరాజు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కొండయ్య


అయ్యప్ప మాలధారణ స్వాములతో కొండయ్య

చీరాల, జనవరి 13: మండలంలోని బోయిన వారిపాలెంలో అయ్యప్ప స్వామి దీక్షకు మాలధారణ చేసిన స్వాముల ఇరుముడి కార్యక్రమం శనివారం జరిగింది. ఈసందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య హాజరయ్యారు. కొండయ్య మాట్లాడుతూ మాల ధారణం నియమాల తోరణమని అన్నారు. నియమ నిష్ఠలతో దీక్షా కాలాన్ని పూర్తిచేసి తమ ఇరుముడిని స్వామివారికి సమర్పించేందుకు వెళుతున్న స్వాములు ప్రయాణం సాఫీగా జరగాలని ఆకాంక్షించారు.

వైసీపీలో సంప్రదింపుల మేళా

● బాలినేనితో సజ్జల ఫోన్‌లో మంతనాలు

● మాగుంటను కలిసిన ఎమ్మెల్యేలు కరణం, సుధాకర్

● మానుగుంటతో వేమిరెడ్డి చర్చలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు నెలకొన్న దశలో శనివారం నాయకుల మధ్య సంప్రదింపులు, సమాలోచనలు, బుజ్జగింపుల పర్వం కొనసాగింది. సీఎం ఇంటర్వ్యూ కూడా దొరక్క అలిగి హైదరాబాద్ వెళ్లి శుక్రవారం జిల్లాలో రెండు ముఖ్య సమావేశాలకు కూడా హాజరుకాని బాలినేని శ్రీనివాసరెడ్డితో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ఇంటెలిజెన్స్ చీఫ్‌లు వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడి బుజ్జగింపులకు శ్రీకారం పలికారు. పార్టీ అధినాయకత్వం పూర్తిగా పక్కనబెట్టిన ఎంపీ మాగుంటతో ఒంగోలులో చీరాల, ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యేలు కరణం బలరాం, సుధాకర్‌బాబులు వేర్వేరుగా భేటీ అయ్యారు. మొత్తంగా వైసీపీలో సంక్షోభ పరిస్థితులు ఏరోజు ఏ మలుపు తిరుగుతాయేనన్న అంశం రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

బాలినేనికి ఫోన్లపై ఫోన్లు

హైదరాబాద్‌లో ఉన్న బాలినేనికి విజయసాయిరెడ్డితో పాటు సజ్జల ఫోన్లు చేసి మాట్లాడినట్లు తెలుస్తోంది. సీఎంను కలిసేందుకు మీకు ఇబ్బంది ఏముంటుంది అసలు మీరు విజయవాడ వచ్చి వేచి ఉన్న విషయమే తెలియదు, తెలిస్తే అలా జరగదు మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడొచ్చి సీఎంను కలవొచ్చని వారు చెప్పినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు మాగుంటతో పాటు బాలినేనితో కూడా కొందరు తెలుగుదేశం నాయకులు టచ్‌లో ఉన్నారని సీఎంకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తదనుగుణంగానే శనివారం వీరు బాలినేనికి ఫోన్లు చేసి సీఎంను కలిసేందుకు రమ్మని కోరినట్లు సమాచారం. అయితే బాలినేని ఇదిగో వస్తున్నా అని మాత్రం చెప్పకపోవటం విశేషం.

మాగుంటతో బలరాం, సుధాకర్‌బాబు భేటీ

ఒంగోలులో ఉన్న మాగుంటతో అధిష్ఠానం నేరుగా మాట్లాడిన దాఖలాలు లేవు. అయితే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాగుంటతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. మీరేమీ విలేకరుల సమావేశం పెట్టి ఏదేదో మాట్లాడాల్సిన అవసరం లేదని కూడా చెప్పాడని అంటున్నారు. ఒంగోలులో ఉన్న మాగుంటను శనివారం ఉదయం ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కలిశారు. మీతోపాటు నేనూ ఉంటా. మీరు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా నడుస్తా. నన్నూ కలుపుకుపోండంటూ ప్రతిపాదించినట్లు వైసీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆ తర్వాత చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కూడా మాగుంటను కలిశారు. ఇప్పటికైతే చీరాల వైసీపీ సీటు ఆయన కుమారుడు వెంకటేష్‌కే ఖరారై ఉంది. అయితే వైసీపీలో ప్రస్తుతం మాగుంట పరిస్థితి సవ్యంగా లేని దశలో అయన్ను కలిసిన బలరాం ఆయనకేమి సలహాలిచ్చారు అనేది కీలకంగా మారింది.

మహీధరరెడ్డితో వేమిరెడ్డి భేటీ

కందుకూరు నియోజకవర్గానికెళ్లి పనిచేసుకోవాలని ఆ పార్టీలో బీసీ విభాగం నాయకుడు బొట్ల రామారావుకు జగన్ సూచించిన నేపథ్యంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డితో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మంతనాలు జరపటం విశేషం. శుక్రవారం రాత్రి వీరిద్దరూ నెల్లూరులో కలిశారు. కాగా శనివారం మహీధరరెడ్డి కందుకూరులో మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నియోజకవర్గ వైసీపీ టికెట్ బీసీ అభ్యర్థికిస్తే స్వాగతిస్తానని ప్రకటించారు. అయితే వేమిరెడ్డి సూచనల మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించినా ఆయన మాటలు జగన్‌కు రుచించాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.

మంత్రి సురేష్ లేకుండా వైపాలెంలో..

వైపాలెం వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన తాటిపర్తి చంద్రశేఖర్ ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మంత్రి సురేష్ లేకుండానే శనివారం నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. తొలుత అయన మార్కాపురంలో ఆ నియోజకవర్గ నేతలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కొద్దిమంది మినహా ముఖ్య నాయకులంతా హాజరయ్యారు. మంత్రి సురేష్‌కు నమ్మినబంటు అయిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భర్త పిచ్చయ్య గైర్హాజరయ్యారు. పెదారవీడు కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీలతో పాటు 11మంది సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. రు. మంత్రి సురేష్ సమయాన్ని ముందు తీసుకోకుండా చంద్రశేఖర్ ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. ఆశించిన స్పందన రాకపోవటంతో చంద్రశేఖర్ అనుయాయులు ఆవేదన వ్యక్తం చేయటం విశేషం.



అన్నంబొట్లవారిపాలెంలో బండలాగుతున్న ఎడ్లు

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 13: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో 36వ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పది జతల ఎడ్లు పాల్గొన్నాయి. తొలుత బరిలోకి దిగిన తెలంగాణరాష్ట్రం సూర్యాపేట, హుజూనగర్‌కు చెందిన ఎస్‌పీ నుంకి సాకేత్ రెడ్డి, ఎస్‌ఎస్‌ఆర్ బుల్స్ సురేంద్రరెడ్డి కంబైన్స్ జత నిర్ణీత సమయం ముగిసేసరికి 2672 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, సీతారాంపురానికి చెందిన సాయినంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ నారాయణరావుకు చెంది న ఎడ్లు 2345.6 అడుగులు, కడప జిల్లా వల్లూరికు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్లు 2587.6 అడుగుల దూరం లాగాయి. పోటీలను తిలకించేదుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పశుపోషకులు పెద్దఎత్తున తరలి రావటంతో ప్రాంగణంలో సందడి వాతా వరణం నెలకొంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు, మర్రి నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

నేటి నుంచి టంగుటూరులో రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ పోటీలు

టంగుటూరు, జనవరి 13 : టంగుటూరులో రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరుగుతాయని జమ్ములపాలెం జడ్పీ హైస్కూల్ పీడీ తులిబిల్లి అశోక్ చెప్పారు. రావూరి అయ్యవారయ్య మెమోరియల్ వారి సహకారంతో టంగుటూరు పురం సెంటర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలను మంత్రి ఆదిమూలపు సురేష్ చేతులు మీదుగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈపోటీలు డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట్స్ వెలుగులో నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు 13వ తేదీ సాయంత్రంలోగా 89195 91417 ఫోన్ చేయాలని కోరారు.

జగన్ పాలనలో సామాన్యులపై పన్నుల భారం

మద్దిపాడు, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో సామాన్యులపై పన్నుల భారం పెరిగి అల్లాడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మద్దిపాడు, లింగంగుంట గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పనకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో ప్రతిఒక్కరి ఆర్థికపరిస్థితి మెరుగుపడేలా చంద్రబాబు కృషి చేస్తారని చెప్పారు. జగన్ పాలనలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవబత్తిన ప్రసాద్, పాటిబండ్ల అజయ్, మండవ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగభూమి సాంస్కృతిక కార్యక్రమం

ఒంగోలు(కల్చరల్), జనవరి 13: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నటరాజస్వామి చిత్రపటానికి సంఘ సభ్యులు, కళాకారులు పూలమాల సమర్పించారు. అనంతరం సంఘ కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షతన వహించిన సభలో సూదనగుంట వెంకటేశ్వర్లు, జాలాది మోహన్, మిడసల మల్లికార్జునరావు, కొలచనకోట ఆంజనేయులు, మాకా ఆంజనేయులు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కోశాధికారి ధేనువకొండ వెంకటసుబ్బయ్య, సభ్యులు దిగ్విజయ్, బాబూరావు, యశోద, ఇంద్రజ్యోతి, సంతవేలూరి కోటేశ్వర రావు, కనమాల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి

జిల్లావ్యాప్తంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు

పలుచోట్ల ఎన్నికల ప్రభావం

రాజకీయపక్షాల ఆధ్వర్యంలో వేడుకలు

పొరుగు ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్న జిల్లావాసులు

బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్

రైతుల ఇళ్లలో అంతంత మాత్రం



జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. వారం రోజుల నుంచే చాలాచోట్ల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలుప్రాంతాలు, రాజకీయ పక్షాల ఆధ్వర్యంలోనూ ఆయా వర్గాలను భాగస్వామ్యం చేస్తూ ఈ తరహా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఉద్యోగ, వ్యాపార, ఉపాధి కోసం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లిన జిల్లావాసులు భారీగా తమ స్వస్థలాలకు తరలివస్తున్నారు. దీంతో గ్రామాలు, పట్టణాలు కోలాహలంగా మారాయి. గ్రామాలకు యువత భారీగా తరలిరావడంతో కళకళలాడుతున్నాయి. అలాగే ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

ఒంగోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పొడవునా అనేక పండుగలు ఉన్నా తెలుగు వారి ఇళ్లలో సంక్రాంతి పెద్ద పండుగ ప్రత్యేకమైంది. పంటలు పొలం నుంచి ఇళ్లకు చేరడం ప్రారంభమయ్యే సమయంలో వచ్చే ఈ పర్వదినాన్ని గ్రామీణ ప్రాంతంలోని రైతులు, రైతుకూలీలు పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. కాలక్రమంలో అనేక మార్పులు సంభవించినా సంక్రాంతి పండుగను మాత్రం అన్నివర్గాల ప్రజలు ఘనంగానే జరుపుకుంటున్నారు. ఉపాధి కోసం, ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా పొరుగు ప్రాంతాలకు వెళ్లిన వారు అలాగే అవసరాల కోసం పల్లెలను వీడి పట్టణాలకు నివాసాలు మార్చిన వారు సైతం సంక్రాంతి పండుగ మూడు రోజులు స్వగ్రామాలకు వచ్చి ఉల్లాసంగా గడపటం అనవాయితీ. అలాగే ఈసారి కూడా పొరుగు ప్రాంతాల్లో ఉండే వేలాదిగా జిల్లావాసులు ఇప్పటికే స్వస్థలాలకు చేరారు. దీంతో హైదరాబాద్, విశాఖ, చెన్నై, బెంగళూరు, ప్రాంతాల నుంచి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. ఈనెల 18 వరకు రిజర్వేషన్లు దొరికే పరిస్థితి లేకపోగా ఆర్టీసీ వందలాది స్పెషల్ బస్సులను ప్రత్యేకంగా నడపుతోంది. ఇక సొంత వాహనాలలో పండుగ రోజుల్లోనూ భారీగానే జిల్లావాసులు వచ్చే అవకాశం ఉంది. అమెరికా ఇతర దేశాలలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాకుండా వివిధ ప్రధాన నగరాల్లో ఉన్న జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువత పెద్దఎత్తున తరలివస్తున్నారు.

ఆటల పోటీలతో కోలాహలం

ఇదిలా ఉండగా సంక్రాంతి పండుగ సమయంలో పల్లె, పట్టణం తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున క్రీడ, సాంస్కృతిక పోటీలు జరుగుతుంటాయి. స్థానికంగా ఎక్కడికక్కడ యువకులు, వివిధ ప్రజాసంఘాలు నిర్వహిస్తారు. క్రికెట్, చెడుగుడు, కబడ్డీ, బాడ్మింటన్ వంటి వాటితోపాటు ఎడ్లపందేలు, ట్రాక్టర్ పోటీలు విస్తారంగా నిర్వహిస్తారు. మరోవైపు మహిళలను ఉత్సాహరుస్తూ ముగ్గులు ఇతరత్రా పోటీల ఏర్పాటు చేస్తుంటారు. అలాగే ఈ ఏడాది కూడా వారంక్రితం నుంచే జిల్లాలో క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సమయంలో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీలు ఈ ఏడాది కూడా జిల్లాలో వారం ముందుగానే జరిగాయి. అప్పటి నుంచి ప్రారంభమైన ఈ సందడి మరో వారంరోజులకుపైగా వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో..

కాగా ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో సంక్రాంతి వేడుకలపై రాజకీయపక్షాల ప్రభావం కనిపిస్తోంది. పలుచోట్ల వివిధ స్థాయిల్లోని రాజకీయ పక్షాల నేతలు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అధికార వైసీపీలో టిక్కెట్ల లొల్లితో అత్యధిక ప్రాంతాల్లో అయోమయ పరిస్థితి కనిపిస్తుండగా జోరు మీద ఉన్న టీడీపీ శ్రేణులు మాత్రం ఉత్సాహంగా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పండుగ సమయంలో మరింత ఉత్సాహంగా ఇవి జరిగే అవకాశం ఉంది. అయితే జిల్లాలోని రైతులు ఇళ్లలో మాత్రం సంక్రాంతి వేడుకల ఉత్సాహం అంతగా కనిపించడం లేదు. ఈ ఏడాది అనావృష్టితో ఖరీఫ్, భారీవర్షాలతో రబీ దెబ్బతినగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని రైతులు పంటలను సాగు చేస్తున్నారు. పెట్టుబడులు భారం కావడంతో పాటు కీలక పంటలు ప్రస్తుతం బెట్ట వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. అదనపు ఖర్చుతో పంటలకు నీరు పెట్టడం, తెగుళ్ల నివారణకు మందులు చల్లడం వంటి పనుల్లో వారు ఉన్నారు. ప్రస్తుతం రైతుల ఇళ్లలో సంక్రాంతి వేడుకల హడావుడి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

భోగభాగ్యాల పండుగ నేడు భోగి



ఒంగోలు (కల్చరల్), జనవరి 13: సంక్రాంతి లక్ష్మికి స్వాగత ద్వారం వంటిది 'భోగి పండుగ. ఆ పండుగ నాటి నుంచి ప్రతి ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంటుంది. ప్రతి మహిళ పండుగ పిండి వంటల తయారీలో తలమునకలవుతుంది. ఇక చిన్నారుల, యువతీ యువకుల ఆటలకైతే అంతే ఉండదు. సంక్రాంతి పండుగ మూడు రోజులు పల్లెపల్లెనా ఆహ్లాదకర వాతావరణ ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తుతుంది. దక్షిణాయణంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగిమంటల రూపంలో అగ్నిదేవుడికి సమర్పించి ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ప్రసాదించమని ప్రార్థించటం కూడా భోగిమంటల్లోని అంతరార్థం. తెల్లవారుజామునే ఆవుపేడ పిడకలు, తాటాకులు, కోసిన పంటల తాలూకు అవశేషాలు మొదలైన వాటిని రాజేసి ఇంట్లోని పాత వస్తువులను ఈ మంటల్లో వేస్తారు. ఈ పండుగ సందర్భంగా ప్రతి పల్లె ఒక క్రీడామైదానంగా మారి సందడి చేస్తుంది.

ఎక్కడెక్కడి వారు స్వగ్రామాలకు..

ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో ఉన్న జిల్లా వాసులు ఈ సంక్రాంతి సందర్భంగా వారి వారి గ్రామాలకు, పట్టణాలకు దాదాపు ఇప్పటికే చేరుకున్నారు. దీంతో జిల్లాలో 'పెద్దపండుగ' వాతావరణ కనిపిస్తోంది. ఇక అనేక స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు భోగి పండుగ రోజు తెల్లవారుజామునే 'భోగిమంటలు' ఏర్పాటుచేయటం, ప్రజలు అక్కడ పెద్దసంఖ్యలో చేరి ఆనందించటం గత కొన్నేళ్లుగా ఒంగోలుతోపాటు అనేక ప్రాంతాల్లో జరుగుతుంది. ఈ సంవత్సరం కూడా ఆదివారం తెల్లవారుజామునే భోగి మంటలు వేయటానికి అనేక సంస్థల వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

అంగన్‌వాడీల కోటి సంతకాల సేకరణ

ప్రభుత్వంతో చర్చలు విఫలం

దీక్ష శిబిరం వద్ద వర్కర్లను దూషించిన వ్యక్తి

అతనిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ఒంగోలు నగరం, జనవరి 13: డిమాండ్ల సాధన కోసం గత 33 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ప్రభుత్వం అంగన్‌వాడీలతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. అంగన్‌వాడీలు సమ్మె చేపట్టినప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వం పలుదఫాలుగా యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. వేతనం రూ.26వేలకు పెంచే విషయంలో ఏకాభిప్రాయం కుదరటం లేదు. వేతనం పెంచాల్సిందేనంటూ అంగన్‌వాడీలు పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి. దీంతో అంగన్‌వాడీలు శనివారం నుంచి ఆందోళనకు కార్యరూపం ఇస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదుట శనివారం ఉదయం ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు ప్రారంభించారు. ఒకవైపు నిరవధిక దీక్షలను కొనసాగిస్తూనే 'జగనన్నకు చెబుదాం' పేరుతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాగా జిల్లావ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమంతో పాటు వివిధ రూపా ల్లో తమ నిరసనను తెలిపారు. మానవ హారాలు, ధర్నాలు, దీక్షలు, వినూత్న రీతిలో కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పారా శ్రీనివాసులు దీక్షలను ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేందుకు ఏ మాత్రం చొరవ చూపటం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదరి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చర్చల పేరుతో అంగన్‌వాడీలను అవమాన పరుస్తుందన్నారు.



సంతకాలు చేస్తున్న అంగన్‌వాడీలు

దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారిని దుర్భాషలాడాడు. వేతనాల కోసం ఆందోళన చేస్తున్న వారిని అవమానకరంగా మాట్లాడాడు. దీంతో అంగన్‌వాడీలు అతనిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కావాలంటూ పోలీసులను కోరారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను అ కారణంగా దర్భాషలాడిన వ్యక్తిని శిక్షించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అన్నపూర్ణ, సంధ్య, సుబ్బమ్మ, ప్రశాంతి, హెమేమా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను



గుంతలతోప్రయాణానికి ఇబ్బందిగా ఉన్న తూర్పుగంగవరం మలుపురోడ్డు (ఫైల్)



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నేత ఔదార్యం

ప్రాణం తీసిన గుంతలను పూడ్చేశారు

పట్టించుకోని పాలకులు, అధికారులు సొంత డబ్బులతో బాగుచేయించిన సుబ్బయ్య

కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

తాళ్లూరు, జనవరి 13 : ప్రమాదలకు నెలవుగా ఉన్న తూర్పుగంగవరం శివారు పెద్దపెద్ద గుంటలను పూడ్చేందుకు అధికార పార్టీనేతలు, ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుకు రాక పోవడంతో తూర్పుగంగవరం గ్రామానికి చెందిన ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వహక కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్య పెద్దపెద్ద గుంతలను పూడ్పించి ప్రజల కష్టాలను పరిష్కరించారు. తూర్పుగంగవరం-తాళ్లూరు రోడ్డు మార్గం గుంతలమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలోని ఇళ్లల్లోని మురుగునీరు, హరిదాస్‌నగర్‌లోని కాలువల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో తూర్పుగంగవరం గ్రామ శివారున మురుగు నీరు నిల్వ ఉండి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, గ్రామపంచాయతీ పట్టించుకోకపోవడంతో రెండు నెలల కిందట దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సొంత నిధులతో తాత్కాలికంగా కంకర తవ్వి తోలించారు. మురుగు నీటి ప్రవాహం ఆగక పోవడంతో ఆ గుంత మరింత పెద్దదిగామారి మురుగు తటాకంలా అయింది.

ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనచోదకులు పలువురు జారీ బురదనీటిలో పడిన సంఘటనలు ఉన్నా యి. మూడు రోజుల క్రితం ఈ గుంటల వల్ల మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓయువకుడు పక్కన వెళ్తున్న టిప్పర్ కింద పడి మృతి చెందారు. దీనిపై చలించిన సుబ్బయ్య తన వంతుగా ప్రమాదాలు జరుగకుండా రోడ్డుకు మర్మతులు చేయించారు. గ్రామ శివారున బురద మయంగా వున్న పెద్దపెద్ద గుంతలను పెద్దరాళ్ల మట్టితో నింపి పైన కంకర్‌తో నింపి జేజర్‌తో చదును చేయించారు. రోడ్డుపైకి మురుగు నీరు నిల్వ ఉండకుండా రోడ్డుకు ఇరుపైవులా కాలువలు తీసి ఖాళీ స్థలంలోకి మురుగు నీరు వెళ్లే చర్యలు చేపట్టారు. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న రోడ్డు బాగవడంతో ప్రయాణికులు ఊపరిపీల్చుకున్నారు


. పనులు చేయించిన టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్యను ప్రజలు అభినందించారు. టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య, హరిబాబు, తదితరులు దగ్గరుండి రోడ్డు పనులు చేయించారు.

చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తా


అందుకే రాజకీయాల్లోకి వచ్చానన్న దుగ్గుమళ్ల

బాపట్లలో అట్టహాసంగా ప్రజా పరిచయవేదిక

బాపట్ల, జనవరి 13: పరిపాలన దక్షత కలిగిన టీడీపీ చంద్రబాబు నాయకత్వంలో పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని విశ్రాంత ఐఆర్ఎస్ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. బాపట్ల క్రిస్టియన్‌భవన్ ప్రాంగణంలో శనివారం ప్రజాపరిచయవేదిక కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న చంద్రబాబు చేసిన అభివృద్ధి తరతరాలు నిలిచిపోతుందన్నారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. అందుకే తాను చంద్రబాబుతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకుని బాపట్ల ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఐఆర్ఎస్‌గా ఎన్నో సేవలందించి, వ్యాపార రంగంలో రాణిస్తున్నప్పటికీ ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. తీరప్రాంతంలో పరిశ్రమలు తీసుకొచ్చేవిధంగా కృషి చేస్తానన్నారు. అంతకముందు జీబీసీరోడ్డులోని ఆర్‌వోబీ నుంచి ర్యాలీగా గడియారస్తంభం సెంటర్ మీదగా క్రిస్టియన్ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అభిమానులు గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, రాధేయ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దగ్గుమళ్ల రాధేయ్, జనసేన నాయకులు సి.విజయ్‌కుమార్, నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, విశ్రాంత సీఈవో జంగా రాజశేఖరరావు, దేవతోటి నాగరాజు, డాక్టర్ కాగిత వరప్రసాదరావు, లేళ్ళ అరుణ తదితరులు పాల్గొన్నారు.



దగ్గుమళ్ళ ప్రసాదరావు, టీడీపీ, జనసేన నాయకులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ప్రసాదరావు



సోమశిలలో 30.725 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 10 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 30.725 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పల్లెకు పండగొచ్చింది

- కలుస్తున్న ఆత్మీయ బంధువులు • ఎటు చూసినా కుశల ప్రశ్నలు • పిండి వంటకాల ఘుమఘుమలు • అల్లుళ్ల సరదాలు.. ఆడపడుచుల అనుబంధాలు



"ఏం మావా బాగున్నావా..!?
ఆ.. బాగున్నా గోపీ! నువ్వెలా ఉన్నావ్!? రా వచ్చి కూర్చో..
కోటిగాడు ఇంకా రాలేదా!? యాడున్నాడట.
నిన్నే వచ్చాడ్రా. సరేగానీ నువ్వాడున్నావ్!? ఏం చేస్తున్నావ్!? ఏమన్నా వెనకేసుకున్నావా!?
అంతా బాగానే ఉంది మామా. పండక్కి మనోళ్లంతా వచ్చినట్టున్నారే!?"

గ్రామాల్లో ఎటు చూసినా ఇలా కుశల ప్రశ్నలే వినిపిస్తున్నాయి. పొట్ట చేతబట్టుకుని నగరాలు, పల్లెలకు వలస వెళ్లిన వారంతా సంక్రాంతి పండుగ పుణ్యమా అని సొంతూళ్లకు చేరుతున్నారు. మొన్నటిదాకా పలకరించేవారు లేక ఇళ్లు ముంగిళ్లు.. రచ్చబండ్లపై బిక్కమొహం వేసుకున్న పండుటాకులు తమ వారిని చూసి మురిసి పోతున్నారు. పెద్దల పలకరింపులు.. నారీమణుల వంటకాలు.. పిల్లల కేరింతలతో అంతటా పెద్ద పండుగ సందడే. పంటలు ఇంటికి రావాల్సిన వేళ.. కరువు కరాళ నృత్యం చేస్తూ వాకిట నిలిచింది. అయినా తరతరాల వారసత్వంగా వస్తున్న పండుగను ఉన్నంతలో వేడుకగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఈసారి నిత్యావసరాలు అటుంచితే... పూలు, పండ్లు, మామిడాకులు, తాటాకులు, తేగలకు యమా డిమాండ్ వచ్చింది. భారమైనా కొనుగోలు తప్పని సరైంది.

ఆత్మకూరు/నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 : రుతువులను నడిపించే సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరానికి కదిలి, మకరరాశిలోకి అడుగుపెట్టే శుభ సమయం జగతికి పర్వదినం. భోగి మంటల వెచ్చదనం... అందరిలో నూతనోత్తేజాన్ని నింపే సంక్రాంతి శుభ దినం.. పంటఫలాలు చేతికొచ్చి రైతుల లోగిళ్లలో ధాన్యరాసులను నింపుతుంది. ఇక కనుమ కర్షకుల పండుగ. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల కలబోతే ఈ పండుగలు. సంక్రాంతి అంటే ఒక్కరోజులో హడావుడిగా జరిగిపోయే పండుగ కాదు. నెల రోజులపాటు పల్లె వాకిట్లో సంక్రాంతి హరివిల్లులతో పల్లెల్లో అందం.. ఆహ్లాదం, బంధువుల సరదా మాటలతో నోరు తీపి చేసుకుంటుంటే.. చిన్నారులంతా ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు. వ్యవసాయ నేపథ్యం, గ్రామీణ వైభవం, ధనుర్మాసం ఆరంభం నుంచే సంక్రాంతి శోభ మొగ్గ విచ్చుకుని ప్రకృతిని పరవసింపజేస్తుంది. కాగా, శనివారం అర్ధరాత్రి తర్వాత ప్రజలు ఇళ్ల ముందు, కూడళ్లలో భోగిమంటలు వేశారు.

● భోగభాగ్యాల భోగి

ప్రియభక్తురాలైన గోదాదేవిని శ్రీవారు పరిణయమాడి ఆమెకు భోగభాగ్యాలు ప్రసాదించిన రోజు కాబట్టి భోగిగా పేరొచ్చిందని నానుడి. భోగినాడు ఇంద్రుడికి పూజ చేయడం శుభకరంగా భావిస్తారు. వేకువజాము నుంచే పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా భోగి మంటలతో సంక్రాంతి పర్వదినానికి స్వాగతం పలుకుతారు. ఇందుకోసం పది రోజుల ముందు నుంచే యువకులు, చిన్నారులు పోటీపడి ముళ్లకంపలు, తాటిమట్టలు తెచ్చి ఇళ్ల ముందు పెట్టుకుంటారు. వీటితోపాటు ఇంట్లోని పాత వస్తువులన్నీ భోగి మంటల్లో వేస్తారు. కష్టాలన్నీ కాలి బూడిదవ్వాలన్నది దీని పరమార్థమని పెద్దలు చెబుతుంటారు. కొందరైతే భోగి మంటల్లోనే లేలేత తేగలు కాల్చుకుని ఆస్వాదించే వారు. మరికొందరు కోళ్లు కోసి భోగి మంటల్లోనే కాల్చి ఉదయమే వేడి వేడి కూడి కూరతో దోశలో ఆరగించే వారు. భోగి రోజే బొమ్మల కొలువు జరిపి, సాయంత్రం ముత్తయిదువులకు పేరంటం చేసుకుంటారు. రేగి పండ్లకూ పండుగలో ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు సంప్రదాయం ప్రకారం భోగి నాడు పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. ఈ పండ్లను పిల్లల తలపై పోస్తే ప్రత్యక్ష నారాయణ అనుగ్రహం వీరికి లభిస్తుందని విశ్వసిస్తారు.



● హరిదాసులు, గంగరెద్దుల సందడి

శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలో వస్తాడని భక్తుల నమ్మకం. సంక్రాంతి సంబరాల్లో హరిదాసులు, గంగిరెద్దుల సంప్రదాయ సందడి ఉంటుంది. వీరు ఇంటింటా తిరుగుతూ తమ కళను ప్రదర్శించి ఆనందింపజేస్తారు. ఇక హరదాసులు తల మీద గుమ్మడి కాయ ఆకారంలో ఉండే పాత్ర భూమికి సంకేతం. శ్రీహరే ఈ ధరణికి పాలకుడు అని చెప్పడమే అందులోని అంతరార్థం.

● పందేల జోరు

సంక్రాంతి వచ్చిందంటే పోటీలు, పందేలు ఊపందుకుంటాయి. పల్లెల్లో కోడి పందాలు ఎక్కువగా జరుగుతాయి. కొన్ని గ్రామాల్లో ఎడ్ల పందాలు నిర్వహించి ఆనందిస్తారు. ఆటల పోటీలు ప్రత్యేక ఆక్షణగా నిలుస్తాయి.

● ముగ్గుల హరివిల్లులు

ధనుర్మాసం ఆరంభం నుంచే మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తుంటారు. ప్రతి గడప రంగువల్లులతో అందంగా మారుతుంది. ఇంటి ముంగిట ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు ముగ్గుకు కొత్తకళను తెస్తాయి. అలాగే పలు సంస్థలు నిర్వహించే ముగ్గుల పోటీల్లోనూ నారీమణులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఒకరికొకరు తోడంటూ కలిసి మెలిసి సాగించే సహజీవనానికి రథం ముగ్గు సంకేతంగా నిలుస్తుంది. అందుకోసమే ఒక రథం ముగ్గును, మరొక ఇంటి రథం ముగ్గుతో కలుపుతుంటారు.



నెల్లూరు : కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న సండే మార్కెట్



సంగం : పండివంటలు తయారు చేస్తున్న మహిళలు

అన్నదాతకు పెద్ద పండుగ

సంక్రాంతి అంటే రైతులకు పెద్ద పండుగే. కాడిపట్టి, మేడిపట్టి, చాలకోలు చేతబట్టి.. సరదా సరదాగా పదరా బసవన్న అంటూ అన్నదాతలు ఆడుతూపాడుతూ పొలాన్ని తొక్కుతూ సేద్యం చేసేవారు. కాడెద్దులు కూడా రైతన్న సైగలకు తగ్గట్టుగానే నడకసాగించేవి. మడక దున్నే సమయంలో ఎద్దుల మెడలోని గంటల సవ్వడికి కర్షకుడి అరుపుల శబ్దం ఎంతో లయబద్ధంగా వీనుల విందుగా ఉండేది. ఇలా పంట పొలాలన్నీ కళకళలాడుతుండగా ధాన్యాగారాలు నిండుగా, అన్నదాత హాయిగా, వ్యవసాయ ఆధారిత చేతి వృత్తుల వారు ఆనందంగా జీవించే రోజులవి.

● మొదటి రోజు భోగి పండుగను జరుపుకుంటే రెండవ రోజు పెద్ద పండుగ పేరుతో సంక్రాంతిని జరుపుకుంటారు. పిల్లలు మొదలు పెద్దలు, వృద్ధులు ఉదయాన్నే తలస్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఇళ్లలో పొంగలు పొంగించి నైవేద్యాన్ని దేవుని వద్ద ఉంచి పూజలు చేస్తారు. పితృదేవతలను స్మరించుకుంటూ వారి పేరున సాంబ్రాణి వేసి దీవించమని మొక్కుతారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇంటిల్లిపాది ఆనందంగా షడ్రుచులతో భోజనం ఆరగిస్తారు. ఈ పండుగల సందర్భంగా చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా అందరూ గాలిపటాలు ఎగరవేస్తారు.

పశువుల పండుగ.. కనుమ

సేద్యంలో వెన్నుదన్నుగా నిలిచే ఎద్దులను అన్నదాతలు అత్యంతప్రీతిపాయంగా చూసుకుంటారు. కనుమ పండుగ పశువులకు అత్యంత ప్రీతికరమైంది. పండుగనాడు ఎద్దులను అలంకరించేందుకు రంగులతాళ్లు, చిక్కాలు, పట్టెంలు తదితర సామగ్రిని రెండు నెలల ముందే రైతులు సిద్ధం చేసుకుంటారు. రంగు రంగుల డిజైన్లతో తాళ్లను తమ సొంత చేతుల మీదుగా తయారు చేసి అలంకరిస్తారు. కనుమ రోజు కోడి పందేలతో ఉత్సాహంగా గడిపే వారు. ఈ పండుగ రోజే మంసాహార భోజనం ఆరగిస్తారు.

అల్లుళ్ల సరదాలు

సంక్రాంతి పండుగనాడు అల్లుళ్ల సరదాలు, ఆడపడుచుల అనుబంధాలు చోటు చేసుకుంటాయి. వృత్తి రీత్యా ఎక్కడున్నా ఈ పండక్కి మాత్రం కుటుంబసభ్యులంతా ఇళ్లకు చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను ఇళ్లకు ఆహ్వానిస్తారు. పెత్తనం అంతా ఆడపడుచులదే. పిండి వంటలు చేసి, కొత్తబట్ట లు పెట్టే ఆనవాయితీ ఎక్కువగా కనిపిస్తుంది.

అంతా రెడీమేడ్ వంటలే!

సంక్రాంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ అరిశెలు, చెక్కలు, లడ్డూలు, మురుకులు, తదితర పిండివంటలను వారం ముందు నుంచే తయారు చేయడంతో ఘుమఘుమలాడుతున్నాయి. పండుగనాడు స్నేహితులు, బంధువులకు పిండివంటలను ఇచ్చిపుచ్చుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, పల్లెల్లో కొంతవరకు పిండి వంటలు చేస్తుండగా నగరం, పట్టణాల్లో దుకాణాల్లో లభ్యమయ్యే వంటలే దిక్కుగా మారాయి.

సంక్రాంతి సమయం

సోమవారం మకర సంక్రాంతి పుణ్యకాలం ఉదయం 7.15 గంటలకు మొదలై సాయంత్రం 5.46 గంటలకు ముగుస్తుంది. మహా పుణ్యకాలం ఉదయం 7.15 నుంచి 9గంటలకు ముగుస్తుంది. మకర సంక్రాంతి సందర్భంగా పితృదేవతలను స్మరించుకుంటూ తమ శక్తిమేర దానధర్మాలు చేయడం వల్ల పెద్దలు, పూర్వీకులు ఆశీస్సులు లభిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయి.

నిరసనాగ్ని!



నెల్లూరు (వ్యవసాయం), జనవరి 13 : ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు ఇస్తానని ముఖ్యమంత్రి జగన్ యువతను నమ్మించి మోసం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో నగరంలోని టీడీపీ కార్యాలయం ఎదుట వేసిన భోగి మంటల్లో జాబ్ క్యాలెండర్ హామీ పత్రాలు, చీకటి జీవోల ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ లేదు.. ఒక్క ఉద్యోగమూ లేదంటూ మండిపడ్డారు. 2.43 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా వైసీపీ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వ అసమర్థతతో వైసీపీ నేతల తీరుతో వెనక్కి వెళ్లిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకో పాలన పోవాలి.. సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, సాబీర్‌ఖాన్, పనబాక భూలక్ష్మి, వడ్లమూడి రమేష్, టిఎన్ఎస్ఎఫ్ నేతలు అమ్ములా, నన్నేసాహెబ్, దర్శి హరికృష్ణ, నారా శ్రీనివాసులు, మాతంగి కృష్ణ, నారా శ్రీనివాసులు, జలదంకి సుధాకర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో జగన్ హామీ ప్రతులు, జీవో ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు



శిథిలా వస్థలో చెత్త కుండీలు



మూలనపడ్డ జరాయి యంత్రాలు

'స్వచ్ఛాంధ్ర' శిథిలం

పట్టణాలు, నగరాల్లోని ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరుతో అందుబాటులోకి తెచ్చిన యంత్రాలు ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమవుతున్నాయి. తక్కువ మంది కార్మికులు ఉన్నప్పటికీ మంచి ఫలితాలనిస్తున్న ఆ యంత్రాలకు టీడీపీ ముద్ర పేరుతో మూలనపడేశారు. చిన్నపాటి మరమ్మతులు చేయించి వినియోగించుకోవాల్సిన వాటిని అలక్ష్యం చేయడంతో అవికాస్తా మట్టిలో కలిసిపోతున్నాయి. ఆ యంత్రాలు అందుబాటులో ఉండి ఉంటే ఇటీవల జరిగిన కార్మిక సమ్మె సమయంలో ఉపయోగకరంగా ఉండేవి.

- నిరుపయోగంగా పారిశుధ్య వాహనాలు
- రూ.లక్షలు వెచ్చించి గత ప్రభుత్వం కొనుగోలు
- విదేశీ పరిజ్ఞానంతో వినూత్న సేవలు
- మూలనపడేసిన వైసీపీ పాలకులు
- స్వల్ప మరమ్మతులకూ నోచుకోక శిథిలం
- వినియోగంలో ఉంటే సమ్మె కాలంలో ఎంతో ఉపయోగం

నెల్లూరు(సిటీ), జనవరి 13 : మున్సిపల్ పారిశుధ్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ యంత్రాల ద్వారా సేవలు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ విదేశీ పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నెల్లూరులో భారీగా వాహనాలను దిగుమతి చేసుకుని విస్తృతంగా వినియోగింపజేశారు. వీటి పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. కొన్నాళ్లపాటు విశిష్టమైన సేవలందించిన అవి వైసీపీ ప్రభుత్వం రావడంతో క్రమేణ మూలనపడ్డాయి. స్వల్ప మరమ్మతులకు కూడా నోచుకోక శిథిలమవుతున్నాయి.

ఎన్నో యంత్రాలు.. అన్నీ వ్యర్థం

రోడ్లపై కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, మట్టిని గాలిద్వారా పీల్చే జరాయి యంత్రాలు 20కుపైగా నెల్లూరులో పనిచేశాయి. అలాగే, రోడ్లను బ్రష్షులతో శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రాలు 10, ఇనుప డస్ట్‌బిన్ల నుంచి చెత్తను తీసుకెళ్లేందుకు కంప్యాక్టర్లు 5, కూడళ్లు, రోడ్లు, నివాసాల మలుపులు వద్ద పెద్ద ఇనుప బిన్లు అనేకం. ఇలా రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరులో అమలు చేసి మంచి ఫలితాలు సాధించింది. భూగర్భ డ్రైనేజీలో ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించేందుకు కార్మిక రహితంగా సేవలందించే దిశగా మరిన్ని యంత్రాలను సమీకరించారు. వీటన్నిటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కొనుగోలు చేశారు. ప్రజలు కూడా ఆ యంత్రాల సేవలను ఆసక్తి, ఆశ్చర్యకరంగా వీక్షించారు. అయితే ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపేస్తూ రూ.లక్షల విలువైన పరికరాలను మూలకునెట్టేశారు. విలువైన సేవలు అందించిన యంత్రాలను వినియోగించడం మానేసి పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పడేశారు. అవి అక్కడి చెట్ల కింద మట్టిలో శిథిలమవుతున్నా అటు ఉన్నతాధికారులుగానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. ఆ పరికరాలన్నీ గతంలో మాదిరి పని చేస్తుంటే నిన్నమొన్నటి వరకు జరిగిన పారిశుధ్య కార్మికుల సమ్మె సమయంలో ప్రత్యామ్నాయంగా ఉపయోగ పడేవని నిపుణులు అంటున్నారు.



వాడకుండా పక్కనపెట్టిన కంప్యాక్టర్

డిమాండ్ల సాధనే లక్ష్యంగా..

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుండగా కావలిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ, కాంగ్రెస్, వామపక్ష నాయకుల మద్దతుతో ఏరియా వైద్యశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన జరిగింది. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, విపక్ష నేతలు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పల్లెల్లో సంక్రాంతి సంబరాల ప్రారంభం

చేజర్ల, జనవరి 13: సంక్రాంతి పండుగ వాతావరణంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. పలు గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. చిత్తలూరు గ్రామంలో స్థానిక యువకులు భోగి, సంక్రాంతి రెండు రోజులు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. అలాగే ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నారు.


చేజర్ల: చిత్తలూరులో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న యువకులు

వ్యాపారం, ఉద్యోగరీత్యా దూర ప్రాంతాలకు వెళ్లినవారు బంధు మిత్రులతో స్వగ్రామాలకు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జామున భోగి మంటలు వేశారు.

● నేతల సంక్రాంతి శుభాకాంక్షలు

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవ రావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త శోభను తేవాలని వారు ఆకాంక్షించారు.

లింగసముద్రం: సంక్రాంతిని మండల ప్రజలు ఆనందోత్సహాలతో జరుపుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మండల జనసేన అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావులు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వరికుంటపాడు: పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం జరిగే భోగి పండుగకు యువత తాటాకులు, ముళ్లకంప తమ నివాసాల వద్దకు చేర్చుకొని సిద్ధంగా ఉంచారు. అలాగే ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు సైతం నివాసాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

కలిగిరి: మండల ప్రజలు సంక్రాంతి వేడుకలకు సిద్ధమయ్యారు. యువకులు, చిన్నారులు వారం నుంచి తాటాకు మోపులను మోటార్‌సైకిళ్లపై తెచ్చుకుని పెట్టుకున్నారు. కాగా 20 తాటాకుల మోపును రూ.100పెట్టి కొనుగోలు చేశారు. మహిళలు పిండివంటలు తయారీలో నిమగ్నమయ్యారు.

అంగన్‌వాడీల సమ్మెకు ప్రతిపక్షాల మద్దతు

కావలిటౌన్, జనవరి13: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా శనివారం ప్రతిపక్షాల నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏరియా వైద్యశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులు అంగన్‌వాడీల శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపారు. శిబిరంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, శ్రీహరినాయుడు, జ్యోతి బాబురావు, జనసేన నేత సాయివిఠల్, సీపీఎం నేత పెంచలయ్య, సీపీఐ నేత బలిజేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ప్రజలంతా అంగన్‌వాడీల సమ్మెకు అండగా ఉంటారని, భయపడాల్సిన పనిలేదని వారికి ప్రతిపక్షాల నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, దుర్గాబాబు, సీపీఎం నాయకులు ఎస్ వెంకయ్య, రాయి మాల్యాద్రి, తుమ్మల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు శనివారం ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, లక్కు కృష్ణప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య తదితరులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించి జగనన్నకు సమస్యలు చెబుదాం కార్యక్రమంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.


ఆత్మకూరు : సంతకాలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలు, అంగన్‌వాడీలు

సంగమేశ్వరాలయ హుండీ లెక్కింపు


సంగమేశ్వరాలయ హుండీ లెక్కిస్తున్న సభ్యులు

సంగం, జనవరి 13: స్థానిక సంగమేశ్వరాలయ హుండీని దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుల సమక్షంలో శనివారం లెక్కించారు. రెండు నెలల కాలానికి సంబంధించి హుండీ లెక్కించగా రూ. 1,00,551 భక్తుల నుంచి కానుకలు వచ్చాయి. వీటితో పాటు హుండీలో ఒక కాసు, చిన్న సైజు బంగారు డాలర్ ఉండగా వీటిని మళ్లీ హుండీలో వేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలప్రసాద్, పూజారి గోపాలకృష్ణమూర్తి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉన్నారు.

40 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి రూరల్, జనవరి 13: మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో మద్యం బెల్టుషాపులపై దాడులు నిర్వహించి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ దాడుల్లో మద్యం విక్రయిస్తున్న రావినూతల ఏసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నిర్వాహకులకు నగదు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

వరికుంటపాడు, జనవరి 13: మండలంలోని కాంచెరువు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విఘ్నేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన ప్రతినిధులచే నిర్వాహకులకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. గ్రామస్థులు ఆలయ నిర్మాణం చేపడుతున్నామని గుంటుపల్లి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించి అందజేశారు. నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు నాగభూషణం పాల్గొన్నారు.

కలిగిరిని వీడని ట్రాఫిక్ కష్టాలు


కలిగిరమ్మ కూడలిలో ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న వాహనాలు

కలిగిరి, జనవరి 13 : పట్టణంలోని కలిగిరమ్మ కూడలి నాలుగు రహదారులు కలిసే ప్రాంతం. కావలి, విజయవాడ, నెల్లూరు, చెన్నై, ఉదయగిరి, కడప, కందుకూరు, హైదరాబాదు ప్రాంతాలకు నాలుగు మార్గాల వెళ్లే బస్సులు ఆగే స్థలం కావడంతో జనసంద్రంగా ఉంటుంది. ఈ ప్రాంతంలోనే ప్రధాన వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, కూరగాయల దుకాణాలు, తోపుడు బండ్లలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతం స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంటుంది. ఉదయం 6 నుంచి 10, సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు ఈ ప్రాంతంలో పాదచారులు నడవాలన్నా, వాహనదారులు ప్రయాణించాలన్నా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సిందే. దీంతో వాహనదారుల మధ్య నిత్యం వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుకాణాలు, తోపుడు బండ్లు రోడ్డు పైకి చొచ్చుకొని రావడం, దుకాణాల వద్ద కొనుగోలు దారులతో నిత్యం రద్దీగా ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం అందరికి తెలిసిందే. ఇప్పటికైనా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ కష్టాల నుంచి తమకు ఉపశమనం కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు

లింగసముద్రం, జనవరి 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు కనీసం 3 నుంచి 10 షాపుల వరకు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని బంకులు, బడ్డీ కొట్లు, ఇంకా చిన్న చిన్న అంగళ్లు, కొన్ని ఇళ్లలో మద్యం సీసాలు నిల్వ ఉంచుకొని అమ్ముకుంటున్నారు. ఈ మద్యం సీసాలు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరఫరా అవుతున్నట్టు ఆరోపణలున్నాయి. మండలంలోని లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం సీసాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తీసుకెళుతుంటారు. అయితే వీరు మద్యం దుకాణాల వద్ద ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా సొమ్ము చెల్లించి కొనుగోలు చేసి, తమ బెల్టు షాపుల వద్ద రూ.20 నుంచి రూ.50 అధిక ధరకు అమ్ముతుంటారు. ముఖ్యంగా ప్రభుత్వ దుకాణాల పక్కనే ఇద్దరు వ్యక్తులు రెండు దుకాణాలు అద్దెకు తీసుకొని మంచినీరు, కూల్‌డ్రింక్స్ ఇతర వస్తువులు విక్రయిస్తూ, వాటితోపాటు మద్యం కూడా అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోక పోవడంతో మద్యం ఏరులై పారుతోంది.ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి విస్తృత ఏర్పాట్లు


సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జనవరి 13: నియోజకవర్గ స్థాయిలో జరగనున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలకు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయనున్న సభావేదిక స్థలాన్ని పరిశీలించి చదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. అనంతరం విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జడదేవి నుంచి సభా ప్రాంగణం వరకు మోటార్‌బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరం, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

వరికుంటపాడు, జనవరి 13: స్థానిక క్రీడా మైదానంలో శనివారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న తిమ్మారెడ్డిపల్లి జట్టు 10 ఓవర్లలో 78 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వరికుంటపాడు జట్టు 52 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. దీంతో విజేతగా నిలిచిన జట్టుకు అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంద్రా పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. • ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటస్వామి, చల్లా సుబ్బరత్నం, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ మల్లికార్జున, వైద్యాధికారిణి శివకల్పన, ఏపీఎం ఖాజారంతుల్లా, ఈవో నరసయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

దివ్యాంగులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ

సీతారామపురం, జనవరి 13: సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఓంకారం వెంకటసుబ్బరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత బస్సు పాస్‌ల కోసం సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన దివ్యాంగులు 9492680279, 7337268192, 898556413 నెంబర్లకు ఈనెల 20వ తేదీ లోపు వివరాలను అందించాలన్నారు.

గంధ మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

అనంతసాగరం, జనవరి 13: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ యూసుఫ్ అలిషా ఖాదరీ గంధమహోత్సవ గోడ పత్రికను దర్గాలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫాతేహా నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందించారు. వచ్చేనెల 10 జరిగే గంధ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని దర్గా నిర్వాహకులు సయ్యద్‌షా హాజి అలిషా ఖాదరి తెలిపారు.

ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఆత్మకూరు, జనవరి 13: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పలువురు ప్రజా ప్రతి నిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీ కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, జేసీయస్ కన్వీనర్లు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు

మర్రిపాడు: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక వైస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయం

● మెడికవర్ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల

ఆత్మకూరు, జనవరి 13 : సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయమని మెడికవర్ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల అనిల్ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలోని నిత్యన్నదాన ప్రాంగణంలో శనివారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఆత్మీయ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వచ్చే అవుట్ పేషంట్లు, వారికి తోడుగా వచ్చే కుటుంబసభ్యులకు ప్రతి రోజు అన్నదానం చేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి అభినందనీయుడని అన్నారు. దాంతో పాటు మున్సిపాల్టీ పరిధిలో ఎవరు మరణించినా వారి కుటుంబాలకు రూ. 10వేలు అందజేస్తుండడం హర్షణీయమన్నారు. అనంతరం పలువురు పట్టణ ప్రముఖులు డాక్టర్ గుండాల అనిల్‌కృష్ణారెడ్డిని, ఆయన తండ్రి ఆత్మకూరు మాజీ సర్పంచ్ గుండాల హనుమాన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుదుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, విశ్రాంత హెచ్ఎం కేవీ శేషారెడ్డి, ఎస్ యానాదిరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, రాంపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెడికవర్ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల అనిల్‌కృష్ణారెడ్డి

కందుకూరు అభివృద్ధికి కలిసి రండి!

● విద్యావంతుల సమావేశంలో టీడీపీ నేత ఇంటూరి


ప్రొఫెషనల్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 13: కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈ ప్రాంత ప్రొఫెషనల్స్ అంతా బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఎం జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలనలో రాష్ట్రానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రజల తలరాతలు మార్చే బాధ్యతను విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు తీసుకోవాలన్నారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో శనివారం రాత్రి నియోజకవర్గంలోని విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ నాలుగేళ్లలో జగన్ వ్యవస్థలన్నింటిని నాశనం చేశాడని విమర్శించారు. ప్రస్తుతం మీరంతా మార్పునకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించిన వారిని కక్షగట్టి వేధించటం ఎదురుతిరిగిన వారిని అడ్డులేకుండా తొలగించివేయటం నేటి పాలనాతీరుగా ఉందని ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులు, మేధావులే బాధ్యతను భుజానవేసుకుని రాష్ట్రంలో మార్పుకు నాందిపలికేలా చూడాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ జగన్ అనే ఆర్థిక ఉగ్రవాదిని నమ్మి గత ఎన్నికల్లో మనలో కూడా అనేకమంది ఆయన గెలుపులో భాగస్వాములయ్యారని ప్రస్తుతం మీరంతా మార్పుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగుల ప్రశ్నలకు నాగేశ్వరరావు బదులిస్తూ కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో పనిచేస్తానని నూతన పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాల మెరుగుకి చర్యలు తీసుకుంటానని వివరించారు. ఈ కార్యక్రమంలో పొడపాటి తేజశ్విని, చల్లా శ్రీనివాసరావు, గొట్టిపాటి వంశీ, బొబ్బూరి వెంగళరావు, సునీల్, రసూ ల్, పువ్వాడి మౌనిక, దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు


రక్తదాతలకు బహుమతులు అందిస్తున్న సుకుమార్ రెడ్డి

కావలిటౌన్, జనవరి13: ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు సుకుమార్‌రెడ్డి అభిమానులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. భారీ కేక్‌కట్ చేయించి పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 192 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆయన బహుమతులు అందచేశారు. అనంతరం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను నమ్ముకున్నవారికి అండగా ఉంటానన్నారు. అధికారం శాశ్వతం కాదని, తాను అధికారానికి దూరంగా ఉన్నా వేలాదిమంది తనకు మద్దతుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో సీఎంజగన్ నిర్ణయం మేరకే నడుచుకుంటానని తెలిపారు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల ప్రారంభం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న పసుపులేటి సుధాకర్

బిట్రగుంట, జనవరి 13: బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఇంగ్లీష్ మీడియం లిటిల్ ఇంగ్లాండ్ క్రీడామైదానంలో శనివారం అంతర్రాష్ట్ర సంక్రాంతి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్- సుగుణ దంపతులు ఈ పోటీలను ప్రాంభించారు. చెన్నై ఐసీఎఫ్ రైల్వే అధికారి ఐయూ.శ్రీనివాసులు, ఐసీఎఫ్ ఎస్ఎస్ఈ కేవీ.రమేష్‌లు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక బెంగళూరు, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి 25 జట్లు వచ్చాయని నిర్వాహకులు ఏ.ఆంథోని, మోజేస్ చిట్టిబాబు, నైనిల్ తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు విజయకుమార్, జీవన్, పరిమి సీతారామయ్య, గుంజి శ్రీనివాసులు, పంది ప్రసాద్, గుత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ బిట్రగుంటకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు.

వెంకట సాయితేజకు అభినందనలు

కావలి, జనవరి 13 : స్థానిక శ్రీచైతన్య డిగ్రీకళాశాల అధ్యాపకుడు పేరూరి వెంకట సాయితేజ ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు. శనివారం కళాశాల చైర్మన్ డాక్టర్ బెజవాడ రవికుమార్, కరస్పాం డెంట్ పాపిశెట్టి జానకీరామ్, ప్రిన్సిపాల్ పీవీ రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, లైవ్ బ్లడ్ వరల్డ్ సంస్థ అధ్యక్షుడు కదిరి మధు సూర్య, టీమ్ సేవియర్స్ అధ్యక్షుడు ప్రణీత్, గుడ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ పసుపులేటి సాయికుమార్ అభినందనలు తెలిపారు.

దాదా దాదీమా దర్గాలో వైభవంగా గంధ మహోత్సవం

అల్లూరు, జనవరి 13 : అల్లూరులోని 200 ఏళ్లనాటి దాదా దాదీమా దర్గాలో శనివారం రాత్రి గంధ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దర్గాను పూలతో సుందరంగా అలంకరించి, కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రాత్రి 12 గంటల వరకు ఫాతెహాలు నిర్వహించి, అనంతరం గంధ మహోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దర్గాను దర్శించుకునేందుకు టీడీపీ నాయకులు బీద గిరిధర్, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి-శివప్రియ దంపతులు, పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు తరలివచ్చారు. వీరికి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


పూలాలంకరణలో దాదా దాదీమా దర్గా

లింగసముద్రంపై మంచు దుప్పటి


లింగసముద్రాన్ని కమ్మేసిన పొగ మంచు

లింగసముద్రం, జనవరి 13: లింగసముద్రాన్ని శనివారం తెల్లవారుజామున మంచుదుప్పటి కమ్మేసింది. 4 గంటల నుంచి లింగసముద్రంతోపాటు పరిసర గ్రామాలను మంచు దుప్పటి కమ్మేయడంతో ఎదురుగా ఏముందో కూడా కనిపించని పరిస్థితి. ఎదురుగా వస్తున్న బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపై కనపడక పోవడంతో లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. పొగమంచు కారణంగా వాకింగ్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7.30 గంటలకు మంచుదుప్పటి తొలగిపోయింది.

మాలకొండ ఆదాయం రూ. 7,60,651

వలేటివారిపాలెం, జనవరి 13: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,60,651 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,900, కుంకుమార్చన ద్వారా రూ. 29,440, వివాహాల ద్వారా రూ. 1000, తలనీలాల ద్వారా రూ. 34 వేలు, వాహనపూజల ద్వారా రూ. 4,020, ప్రత్యేకదర్శం ద్వారా రూ. 2,37,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,320, రూము అద్దెల ద్వారా రూ. 16,910, కవర్ల విక్రయం ద్వారా రూ. 4,500, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,84,610, అన్నదానం ద్వారా రూ. 2,29,201, విరాళాల ద్వారా రూ. 10,650 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

లింగసముద్రం, జనవరి 13 : సంక్రాంతి సందర్భంగా మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం బాజీబాబు శనివారం చెప్పారు. పండుగ రోజుల్లో పేకాట, కోడిపందేలు, గుండాట నిర్వహించినా, పాల్గొన్న వారిపైనా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఈ బైక్ ఎవరిది..?


కోవూరుపల్లి జాతీయ రహదారి పక్కన పల్సర్ బైక్

బిట్రగుంట, జనవరి 13: బోగోలు మండలం కోవూరుపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న పల్సర్ బైక్ (ఏపీ 39డీబీ 0150) ఎవరిదనేది అంతుచిక్కడం లేదు. వారం రోజులుగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఈ బైక్ వెనుక నంబరు ప్లేటు తీసేసి ఉన్నారు. దీన్ని చూసి గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ బైక్ ఎవరిది.. ఎందుకు ఈ విషయంలో పోలీసులు చొరవ తీసుకుని నిగ్గు తేలాల్సి ఉంది.

ఆడుదాం ఆంధ్రా పోటీలు


కబడ్డీ ఆడుతున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు

దగదర్తి (బిట్రగుంట), జనవరి 13: దగదర్తి మండల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారం ఎంపీడీవో వెంకటనారాయణమ్మ, ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఎంపీపీ తాళ్ళూరి వెంకట కృష్ణ ప్రసాద్ నాయుడు పురుషుల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన ఓ జట్టువైపు బరిలో దిగి కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో తడకలూరు సర్పంచు ఆత్మకూరు గిరినాయుడు, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ

కందుకూరు : సంక్రాంతిని పురస్కరించుకుని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తన కుటుంబసభ్యులతో కలిసి అందరికీ వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం విషయంలో కరస్పాండెంట్ రామయ్య సహృదయత అభినందనీయమని పేర్కొన్నారు.


వస్త్రాలు అందుకున్న ఉద్యోగులు